వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 318 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | మే 2025 | వెల : రూ 10/-



## త్రివేణి సంగమంలో గవర్నర్ దంపతుల పుష్కర స్నానం

**ముక్తీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు**

**స్వాగతం పలికిన మంత్రి శ్రీధర్‌బాబు**

**భూపాలపల్లి**
కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు పుష్కరస్నానం ఆచరించి ముక్తీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం హైదరాబాద్ నుంచి ఉదయం 11.02 గంటలకు హెలికాప్టర్ ద్వారా జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం చేరుకున్న గవర్నర్ దంపతులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి నేరుగా త్రివేణి సంగమం సరస్వతి ఘాట్ -మిగతా 3 లో

## 2న పంచాయతీ ఎన్నికలపై

# ప్రకటన?

**ఎన్నికల నిర్వహణపై సమాలోచన**

- ఉన్నతాధికారులతో సీఎం భేటీ
- సన్నబియ్యం, రేషన్‌కార్డులు, రాజీవ్ యువవికాసంపైనే ఆశలు
- ఆలస్యమైతే ఇంకా నష్టమనే భయం

**హైదరాబాద్,**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వ పెద్దలు కీలక ప్రకటన చేయనున్నట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. -మిగతా 3 లో








## ఆపరేషన్ సిందూర్‌పై తీర్మానం

- ఆపరేషన్ సిందూర్‌లో సాయుధ దళాలను కొనియాడుతూ తీర్మానం
- ఎన్డీఏ సమావేశంలో ఆమోదం


**న్యూఢిల్లీ**
ఆపరేషన్ సిందూర్‌పై ఎన్డీఏ సమావేశంలో తీర్మానం చేశారు. ప్రధాని మోడీ అధ్యక్షతన ఆదివారం అశోకా హౌటల్‌లో భాగస్వామ్య పక్షాల సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రంలో ఎన్డీఏ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం జరిగింది. మోడీ 3.0లో ఏడాది పాలన, ఆపరేషన్ సిందూర్, దేశ భద్రత సహా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, -మిగతా 3 లో

## రాష్ట్రంలో మూడ్రోజులు భారీ వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక
- చురుగ్గా నైరుతి రుతుపవనాలు
- కేరళ, గోవా మొత్తం విస్తరణ
- కర్నాటక, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాల్లో కొంత మేర వ్యాప్తి

**హైదరాబాద్ 25 మే-నేటి భారత్**
రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. అదే సమయంలో -మిగతా 3 లో





## ఢిల్లీలో భారీ వర్షాలు

- ఈదురుగాలులు, ఉరుములతో దంచికొట్టిన వాన
- జలమయమైన నగరం..రోడ్లపై విరిగిపడిన చెట్లు
- ట్రాఫిక్‌కు అంతరాయం..రెడ్ అలర్ట్ జారీ
- నిలిచిన 100కి పైగా విమానాలు.. మరో 25 దారి మళ్లింపు

**ఢిల్లీ 25**
దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఆదివారం తెల్లవారుజామున ఢిల్లీతోపాటు రాజధాని ప్రాంతంలో ఈదురుగా లులు, ఉరుములు, మెరుపులతో వాన దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురుగాలులకు పలుచోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. రహదారులన్నీ -మిగతా 3 లో



## కేసీఆర్ తో కేటీఆర్ భేటీ

**హైదరాబాద్**
ఇటీవల ఎమ్మెల్సీ కవిత, తన తండ్రి కేసీఆర్‌కు రాసిన అంతర్గత లేఖ బయటకు రావడం, ఆ తర్వాత ఆమె మీడియా సమావేశంలో "కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి" అంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లోనూ, రాజకీయంగానూ తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ లేఖ, కవిత వ్యాఖ్యలు, తదనంతర పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. -మిగతా 3 లో

## ఈసెట్‌లో 17,768 మంది ఉత్తీర్ణత

- అర్హత పొందిన వారిలో అమ్మాయిలే అధికం
- ఫలితాలు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మెన్ బాలకిష్టారెడ్డి



**హైదరాబాద్**
రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈసెట్ రాతపరీక్ష ఫలితాలను ఆదివారం హైదరాబాద్ ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి -మిగతా 3 లో

## ఐదు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల

- గుజరాత్, కేరళ, పంజాబ్, పశ్చిమబెంగాల్‌లోని ఐదు నియోజకవర్గాలకు
- జూన్ 19న పోలింగ్, జూన్ 23న ఓట్ల లెక్కింపు




**న్యూఢిల్లీ:**
నాలుగు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ స్థానాలకు భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) ఆదివారం ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. గుజరాత్, కేరళ, -మిగతా 3 లో

## పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చూడండి

- ప్రతీ శనివారం ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సమావేశం ఏర్పాటు
- ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్‌మెంట్ సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి
- హ్యుందాయ్ ఆర్‌అండ్‌డీ సెంటర్‌కు ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదం



**హైదరాబాద్**
ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడంతోపాటు యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలను కల్పించే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చూసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార అధికారులకు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన అధ్యక్షతన ప్రజాభవన్‌లో ఇండస్ట్రియల్ ప్రమోషన్ -మిగతా 3 లో

## గాజాపై ఇజ్రాయెల్ దాడి..

**38 మంది మృతి**



**గాజా స్ట్రిప్,**
గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. 24 గంటల వ్యవధిలో ఆ దేశం జరిపిన వైమానిక దాడుల్లో 38 మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ ఆదివారం తెలిపింది. ఒక టెంట్‌లో ఆశ్రయం పొందుతున్న తల్లి, ఆమె ఇద్దరు పిల్లలు కూడా మృతుల్లో ఉన్నారని -మిగతా 3 లో

# క్షిపణులతో రష్యా భీకర దాడులు



**25 మే- ప్రజా స్వేచ్ఛ**

ఉక్రెయిన్-రష్యా దేశాల మధ్య ఒకవైపు యుద్ధ ఖైదీల మార్పిడి జరుగుతుంటే మరోవైపు యుద్ధం జరుగుతోంది. ఇరుదేశాల మధ్య పరస్పర దాడులకు మాత్రం అడ్డుకట్ట పడటంలేదు. ఆదివారం వందలాది మంది సైనికులు, పౌరులను విడిచిపెట్టిన రష్యా.. అంతకు కొన్ని గంటల ముందే ఉక్రెయిన్‌పై భీకర దాడులకు తెగబడింది. ఏకంగా 298 డ్రోన్‌లు, 69 క్షిపణులతో దాడికి పాల్పడింది. రష్యా తాజా దాడుల్లో 12 మంది మృతిచెందారు. మూడేళ్ల యుద్ధంలో ఒకేసారి ఈ స్థాయిలో డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయడం ఇదే తొలిసారని ఉక్రెయిన్ సైనిక వర్గాలు వెల్లడించాయి. కాగా యుద్ధ ఖైదీల అప్పగింతలో భాగంగా శుక్రవారం ఇరుదేశాలు 390 మంది చొప్పున యుద్ధ ఖైదీలను మార్పిడి చేసుకోగా.. శనివారం 307 మంది చొప్పున మార్పిడి చేసుకున్నాయి. తాజాగా ఆదివారం 303 మంది చొప్పున సైనికులను పరస్పరం అప్పగించుకున్నట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. అయితే ఈ ప్రకటన రాకముందు ఉక్రెయిన్‌లోని కీవ్‌తోపాటు ఇతర ప్రాంతాలపై మాస్కో భీకర దాడులు చేసింది. ఒకేరోజు 69 క్షిపణులు, 298 డ్రోన్లతో విరుచుకుపడింది. వీటిలో ఇరాన్ రూపొందించిన షాహెద్ డ్రోన్లు కూడా ఉన్నట్లు సమాచారం. మొత్తంగా ఈ దాడుల్లో 12 మంది చనిపోగా అనేకమంది గాయాలపాలయ్యారు. ఉక్రెయిన్‌లోని 30 నగరాలు, గ్రామాలపై ఉద్దేశపూర్వక దాడులు జరిగాయని అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. తాజా దాడి నేపథ్యంలో రష్యాపై ఆంక్షలు విధించాలని పాశ్చాత్య దేశాలను అభ్యర్థించారు. రష్యా నాయకత్వంపై బలమైన ఒత్తిడి తీసుకువస్తే తప్పితే ఈ దారుణాలకు అడ్డుకట్ట వేయలేమని పేర్కొన్నారు.

# అయోధ్యలోని హనుమాన్ గర్హిలో విరాట్ దంపతుల పూజలు..



**న్యూఢిల్లీ 25 మే- ప్రజా స్వేచ్ఛ**

భారత స్టార్ క్రికెటర్ , టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ , ఆయన భార్య అనుష్క శర్మ అయోధ్య లోని ప్రముఖ హనుమాన్ గర్హి దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. అక్కడ హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూలమాలలతో కోహ్లీ, అనుష్క శర్మ దంపతులను సత్కరించారు. ఇద్దరికీ నుదుట తిలకం దిద్దారు. ఆ తర్వాత స్వామివారి చిత్రపటాలను అందజేశారు. కాగా ఇటీవలే విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ దంపతులు ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక గురువైన ప్రేమానంద్ గోవింద్ శరణ్ జీ మహరాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత విరాట్ కోహ్లీ ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తున్నాడు. అనుష్కశర్మతో కలిసి పలు క్షేత్రాలు సందర్శిస్తున్నాడు.

# గుజరాత్‌లో నేటి నుంచి ప్రధాని పర్యటన




**అహ్మదాబాద్ 25 మే- ప్రజా స్వేచ్ఛ**

ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం నుంచి రెండు రోజుల పాటు సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయన రూ.77,400 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారం భిస్తారు. మోడీ ఎల్ లోకోమోటివ్ తయారీ ప్రాజెక్టును ప్రారంభిస్తారని, దాహోద్ నుంచి ఎలక్ట్రిక్ లోకోమో టివ్‌కు పచ్చజెండా ఊపుతారని ఓ ప్రకటనలో వివరించారు. భుజ్‌లో రూ.53,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభిస్తారు. 20 సంవత్సరాల గుజరాత్ పట్టణ ప్రగతిని చాటిచెప్పే ఓ కార్యక్రమానికి మోడీ హాజరవు తారు. గాంధీనగర్‌లో పట్టణాభివృద్ధి సంవత్సరాన్ని ప్రారంభిస్తారు. వెరావల్-అహ్మదాబాద్ మధ్య నడిచే వందేభారత్ రైలును, వల్సాద్- దాహోద్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును కూడా ప్రారంభిస్తారు. వీటితో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు కూడా మోడీ శ్రీకారం చుడతారు.

# ట్రంప్ పేరుతో భారీ స్కామ్..!

**న్యూఢిల్లీ 25 మే- ప్రజా స్వేచ్ఛ**

సైబర్ నేరగాళ్లు టెక్నాలజీని వాడుకొని ప్రజలను మోసం చేస్తున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో కర్ణాటక లో దాదాపు 150 మందిని నమ్మించి రూ.కోటికి పైగా దోచుకొన్నారు. సైబర్ మోసగాళ్ల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించి డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతున్నట్లు వీడియోలను సృష్టించారు. తాను ట్రంప్ పేరుతో యాప్‌ను రూపొందించానని, పెట్టుబడులు పెట్టాలని తద్వారా అధిక లాభాలు గడించవచ్చని అమెరికా అధ్యక్షుడు సూచిస్తున్నట్లు ఉన్న పలు వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. దాంతో కర్ణాటకలోని




తుమకూరు, బెంగళూరు, హవేరి ప్రాంతాలలోని దాదాపు 150 మంది ఆ వీడియోలను నమ్మి, అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి, యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. వారికి నేరగాళ్లు యూఎస్ ప్రభుత్వానివే అని నమ్మించేలా ధ్రువీకరణ పత్రాలు కూడా జారీ చేశారు. వారు పెట్టిన పెట్టుబడులకు లాభాలు వచ్చినట్లు కొద్ది నెలలపాటు చూపిస్తూ.. డబ్బు, ఇతర బహుమతులు అందించారు. కొద్ది రోజులకు యాప్ నిర్వాహకులు తమ కాల్స్‌కు సమాధానం ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సైబర్ మోసగాళ్ల వలలో పడి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 150 మంది కోటి రూపాయలకు పైగా విలువైన డబ్బు పోగొట్టుకున్నట్లు గుర్తించామని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇలాంటి నకిలీ యాప్‌లు, కంపెనీల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, సైబర్ మోసగాళ్ల వలలో పడొద్దని సూచించారు.

# కొచ్చి తీరంలో హై అలర్ట్..!

## ఆ నౌకలో ప్రమాదకర కెమికల్స్..


**కొచ్చి 25 మే- ప్రజా స్వేచ్ఛ**

కొచ్చి తీరంలో మునిగిపోయిన నౌకలో ప్రమాదకర రసాయనాలు ఉండటంతో ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులు ఆ ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించారు. లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక శనివారం కేరళలోని కొచ్చి తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదానికి గురైంది. ఆ నౌక ముందుగా ఒకవైపు ఒరిగిపోయి ఆ తర్వాత మెల్లగా మునిగిపోయింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మునిగిపోయిన నౌకలో మొత్తం 640 కంటెయినర్‌లు ఉండగా, వాటిలో 13 కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటెయినర్లలో కాల్షియం కార్బైడ్, మిగిలిన వాటిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ ఉన్నట్లు ఇండియన్ కోస్ట్ గార్డ్స్ తెలిపారు. ఆ రసాయనాలు లీకైతే సముద్ర జలాలు తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదం ఉండడంతో అధికారులు కొచ్చి తీరంలో హై అలర్ట్ ప్రకటించారు. కంటెయినర్లను గానీ, వాటిలో నుంచి బయటకు



వచ్చిన ఇంధనం గానీ తీరం వైపునకు వస్తే తాకొద్దని ప్రజలను కేరళ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం లీకై ఎంత మేరకు వ్యాపించిందనే విషయాన్ని తెలుసుకోవడానికి 'ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ' ని వినియోగించే విమానం సముద్రంపై చక్కర్లు కొడుతోందని అధికారులు తెలిపారు. రసాయనాల నౌక మునక కారణంగా తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విఝింజమ్ పోర్టు నుంచి శుక్రవారం బయల్దేరిన 184 మీటర్ల పొడవున్న ఎంఎస్‌సీ ఎల్సా-3 నౌక శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ తీరానికి చేరుకోవాల్సి ఉండగా.. కొద్దిసేపటి ముందు సముద్రంలో మునిగిపోయింది. కాగా, కంటెయినర్ నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన ఇండియన్ కోస్ట్ గార్డ్ వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. అందులో ఉన్న మొత్తం 24 మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చినట్లు కోస్ట్ గార్డ్ అధికారులు తెలిపారు.

# స్కెంజెన్ వీసాల తిరస్కరణతో రూ.136 కోట్లు నష్టపోయిన భారత్



**న్యూఢిల్లీ 25 మే- ప్రజా స్వేచ్ఛ**

గత సంవత్సరం స్కెంజెన్ వీసాల తిరస్కరణ కారణంగా మన దేశం ఫీజుల రూపంలో రూ.136 కోట్లు నష్టపోయింది. 2024లో మొత్తం 1.65 లక్షల స్కెంజెన్ వీసాలను తిరస్కరించారు. యూరోపియన్ యూనియన్‌లోని 29 దేశాలలో స్వల్పకాలిక పర్యటనల కోసం అనుమతించేందుకు స్కెంజెన్ వీసాలు జారీ చేస్తారు. గత సంవత్సరం అల్గేరియా, టర్కీ జాతీయుల తర్వాత స్కెంజెన్ వీసాల తిరస్కరణ కారణంగా ఎక్కువగా నష్టపోయింది భారతీయులే. స్కెంజెన్ వీసా కోరుకునే వ్యక్తి దరఖాస్తు ఫీజుగా రూ.8,500 చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తును ఆమోదించినా లేక తిరస్కరించిన ఫీజును వాపసు చేయరు. గత సంవత్సరం భారతీయులు 11 లక్షలకు పైగా స్కెంజెన్ వీసాల కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 5,91,610 దరఖాస్తులకు ఆమోదం లభించింది. కానీ 1.6 లక్షలకు పైగా తిరస్కరణకు గురయ్యాయి. అంటే తిరస్కరణల రేటు 15 శాతంగా ఉంది. భారతీయ పర్యాటకులకు ఫ్రాన్స్ నుండే ఎక్కువగా తిరస్కరణలు ఎదురయ్యాయి. దీని వల్ల రూ.25.8 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే అల్గేరియా అత్యధికంగా రూ.153 కోట్లు నష్టపోగా టర్కీ (రూ.140.6 కోట్లు), భారత్ (రూ.136.6 కోట్లు), మొరాకో (రూ.95.7 కోట్లు), చైనా (రూ.66.7 కోట్లు) దేశాలు ఆ తర్వాతి స్థానాలలో నిలిచాయి.

# ఐయూఎంఎల్ జాతీయ నాయకత్వంలో మహిళలు



**తిరువనంతపురం 25 మే- ప్రజా స్వేచ్ఛ**

ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) తొలిసారిగా ఇద్దరు మహిళలను జాతీయ నాయకత్వం లో నియమించింది. వీరిలో ఒకరు హిందూ దళిత మహిళ. కేరళ రాజకీయాలలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం లభించడం లేదంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఐయూఎంఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాక ప్రగతిశీల పక్షంగా తమ ఇమేజ్‌ని పెంచుకోవడం కూడా దీని వెనుక ఉన్న ఉద్దేశం. కేరళకు చెందిన జయంతి రాజన్, తమిళనాడుకు చెందిన స్థానిక కౌన్సిలర్ ఫాతిమా ముజఫర్‌లకు పార్టీ జాతీయ కమిటీలో సహాయ కార్యదర్శులుగా స్థానం కల్పించారు. చెన్నైలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాజన్ వాయనాడ్ జిల్లాకు చెందిన ఓబీసీ నాయకురాలు కాగా ఫాతిమా చెన్నై ఎగ్మోర్‌లోని ఓ వార్డుకు కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నారు.

# మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగి ఆరోపణలపై విచారణ జరపాలి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

**హైదరాబాద్25 మే- ప్రజా స్వేచ్ఛ**

మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. "మిస్ వరల్డ్ లాంటి అంతర్జాతీయ వేదికలపై మహిళల పట్ల వివక్షాపూరిత ఆలోచనలు ఉన్న మెంటాలిటీనీ ఎదిరించడానికి చాలా ధైర్యం కావాలి. తెలంగాణలో మీరు ఇలాంటి



అనుభవాన్ని ఎదుర్కొన్నందుకు మేం చింతిస్తున్నాం. ఇక్కడ మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉంది. మహిళలను పూజిస్తాం, గౌరవిస్తాం, వారి అభివృద్ధికి సమాన అవకాశాలను కల్పిస్తాం. రాణి రుద్రమ, చిట్యాల ఐలమ్మ వంటి గొప్ప నాయకులు మా తెలంగాణ మట్టిలో పుట్టినవారే" అని కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. మీరు ఎదుర్కొన్న ఈ చేదు అనుభవం నిజమైన తెలంగాణను ప్రతిబింబించేది కాదని అన్నారు. ఏ ఒక్క మహిళ గానీ, ఆడపిల్ల గానీ ఇలాంటి భయానక అనుభవాలను ఎదుర్కోకూడదనీ, ఒక అమ్మాయికి తండ్రిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. బాధితురాలిని విమర్శించడం, ఆమెను తప్పుగా చూపించడం మాని ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

# రాష్ట్రంలో మూడ్రోజులు భారీ వర్షాలు

(మొదటి పేజి తరువాయి)

గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు నుంచి ఏడు డిగ్రీల మేర తగ్గే సూచనలున్నట్టు తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 200 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. సోమవారం నాడు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో, మంగళవారం నాడు భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో, 28న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు



కురిసే అవకాశముంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులు వీచే అవకాశముంది. హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నగరంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయి. నైరుతి రుతుపవనాలు చురుగ్గా ముందుకు సాగుతూ విస్తరిస్తున్నాయి. కర్నాటకలోని మరికొన్ని ప్రాంతాలకు, గోవా అంతటా, మహారాష్ట్ర, మణిపూర్, నాగాలాండ్, మిజోరంలోని కొన్ని ప్రాంతాలకు, బంగాళాఖాతంలోని పలు ప్రాంతాలకు వ్యాప్తిచెందాయి.

అత్యధిక వర్షం కురిసిన ప్రాంతాలు

మాటూరు (నల్లగొండ) 4.5 సెంటీమీటర్లు

రాజంపేట(యాదాద్రి భువనగిరి) 4.2 సెంటీమీటర్లు

ముల్కచర్ల(నల్లగొండ) 3.3 సెంటీమీటర్లు

పాముకుంట(యాద్రాద్రి భువనగిరి) 3.1 సెంటీమీటర్లు

# ఢిల్లీలో భారీ వర్షాలు

(మొదటి పేజి తరువాయి)

వరద నీటితో నిండిపోయాయి. దీంతో ప్రధాన జంక్షన్లలో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వందకు పైగా విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. మరో 25కి పైగా విమానాలను దారి మళ్లించారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు అడ్వైజరీ జారీచేసింది. ప్రతికూల వాతారణంతో విమానాల రాకపోకలపై ప్రభావం పడిందనీ, ఇంకా సర్వీసులను పునరుద్ధరించలేదని వివరించింది. ప్రయాణికులు తమ తమ విమానయాన సంస్థలను సంప్రదించాలని కోరింది. శనివారం రాత్రి 11:30 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల మధ్య సుమారు 49 విమానాలను దారి మళ్లించినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో 5 నుంచి 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో 81 మిల్లీ మీటర్లు, పాలంలో 68 మిల్లి మీటర్లు, పూసా 71 మిల్లి మీటర్లు, మయూర్ విహార్‌లో 48 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయింది. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని వెల్లడించింది. భారీ వర్షంతో మింటో రోడ్డు వద్ద ప్రాంతం పూర్తిగా నీటితో నిండిపోవడంతో ఒక కారు మునిగిపోయింది.

**ఢిల్లీకి రెడ్ అలెర్ట్**

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి రెడ్ అలెర్ట్‌ను ప్రకటించింది. ఢిల్లీ, దాని పరిసర రాష్ట్రాల్లో ధూళి తుఫాను, ఆ తర్వాత ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందనీ, గంటకు 60 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ వివరించింది.

**ఎయిర్‌పోర్ట్‌లో కూలిన రూఫ్ భాగం**

దేశ రాజధానిలో కురుస్తున్న భారీ వర్షాలకు ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 1 వద్ద ఉన్న రూఫ్ కొంత భాగం కూలిపోయింది. దీంతో అక్కడున్న వ్యక్తులు భయంతో పరుగులుతీశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు అడ్వైజరీ జారీచేసింది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో రూఫ్ భాగం కూలిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# ఈసెట్‌లో 17,768 మంది ఉత్తీర్ణత

(మొదటి పేజి తరువాయి)

బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ కుమార్ మొలుగారం విడుదల చేశారు. ఈనెల 12న ఈసెట్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 19,672 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 18,928 (96.22 శాతం) మంది హాజరయ్యారు. వారిలో 17,768 (93.87 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 11,835 మంది అబ్బాయిలు పరీక్షలు రాయగా, 10,972 (92.71 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 7,093 మంది అమ్మాయిలు పరీక్షలు రాస్తే, 6,796 (95.81 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఈసెట్ ఫలితాల్లోనూ అమ్మాయిలే పైచేయి సాధించారు. అబ్బాయిల కన్నా అమ్మాయిలు 3.1 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. 11 కోర్సుల్లో ప్రవేశాలకు ఈసెట్ రాతపరీక్షను నిర్వహించారు. అత్యధికంగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగానికి 5,336 మంది దరఖాస్తు చేయగా, 5,138 మంది పరీక్ష రాశారు. వారిలో 4,774 (92.92 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)కి 4,879 మంది దరఖాస్తు చేస్తే, 4,728 మంది పరీక్ష రాశారు. వారిలో 4,522 (95.64 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగానికి 4,201 మంది దరఖాస్తు చేస్తే, 4,053 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 3,719 (91.76 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. సివిల్ ఇంజినీరింగ్‌కు 2,578 మంది దరఖాస్తు చేయగా, 2,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 2,389 (96.45 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మెకానికల్ ఇంజినీరింగ్‌కు 2,035 మంది దరఖాస్తు చేస్తే, 1,949 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 1,813 (93.02 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. అత్యల్పంగా బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుకు 30 మంది దరఖాస్తు చేయగా, పది మంది పరీక్ష రాశారు. వందశాతం ఉత్తీర్ణత పొందారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ కుమార్ మొలుగారం, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఓయూ రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి, ఈసెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్, ఎస్‌బీటెట్ ఇన్‌చార్జీ బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**లీజు క్వార్టర్లపై సమీక్షిస్తాం : కుమార్**

ఓయూలో రెండు క్వార్టర్లను గతంలో లీజుకిచ్చారనీ, తాను ఇవ్వలేదని వీసీ ఎం కుమార్ చెప్పారు. వాటిపై సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. ఏటా ఓయూ స్నాతకోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. తాను వచ్చాక ఫీజులను పెంచలేదన్నారు. ఓయూ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఎమర్జింగ్ కోర్సులను ప్రవేశపెడుతున్నామని అన్నారు. రాష్ట్రంలో వచ్చేనెల 15 నుంచి ఈసెట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి అన్నారు.

# కేసీఆర్ తో కేటీఆర్ భేటీ

(మొదటి పేజి తరువాయి)

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన కేటీఆర్, ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీలో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు, రాబోయే కార్యక్రమాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు, జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పార్టీ ఆధ్వర్యంలో ఏ విధంగా నిర్వహించాలనే దానిపై కూడా వీరి మధ్య చర్చలు జరిగాయని తెలుస్తోంది. అయితే జూన్ 1న కేటీఆర్ అమెరికా వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన పార్టీ కార్యక్రమాలపై ఒక స్పష్టమైన కార్యాచరణను రూపొందించేందుకే కేసీఆర్‌తో కేటీఆర్ చర్చించినట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి.

## గాజాపై ఇజ్రాయెల్ దాడి..

(మొదటి పేజి తరువాయి)

వివరించింది. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన తర్వాత మార్చి నుంచి ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల్లో 3,785 మంది పౌరులు మరణించారని వెల్లడించింది.కాగా, హమాస్‌ను పూర్తిగా నిరాయుధీకరణ చేయడమే కాక, వారి వద్ద బందీలుగా ఉన్న 53 మంది తమ దేశ పౌరులను విడిపించేంత వరకు దాడులు కొనసాగుతూనే ఉంటాయని ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రతిజ్ఞ బూనింది. అంతేకాక, గత రెండున్నర నెలల నుంచి గాజాకు ఆహారం, మందులు, చమురు సరఫరాను నిలిపివేసింది. దీంతో అక్కడి పౌరులు ఆకలితో అల్లాడుతున్నారు. ఐరాస, ఇతర అంతర్జాతీయ సంస్థల ఒత్తిడి మేరకు మానవతా సాయాన్ని పాక్షికంగా ఇజ్రాయెల్ పునరుద్ధరించింది.

## 2న పంచాయతీ ఎన్నికలపై ప్రకటన?

(మొదటి పేజి తరువాయి)

ఆ తర్వాత జూన్ 5లోగా స్టేట్ ఎలక్షన్ కమిషన్ (ఎస్ఈసీ) నుంచి ఈ మే రకు ప్రకటన రావచ్చని పేర్కొన్నాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (పీఆర్) కమిషనర్ సృజన, ఇతర ఉన్నతాధికారులతో తాజాగా సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. పంచాయతీ ఎన్నికలు జరపాలని ఎమ్మెల్యేల నుంచి ఒత్తిడి వస్తున్నదని సీఎం తెలుపగా, ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసి ఉంచామని అధికారులు చెప్పినట్టు సమాచారం. బ్యాలెట్ పేపర్లు సైతం ముద్రించి సిద్ధంగా ఉంచామని చెప్పినట్టు తెలిసింది. సీఎంతో భేటీ అనంతరం తొలిసారిగా కమిషనర్ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఇతర ముఖ్య అధికారులతో మాట్లాడినట్టు అధికారవర్గాలు సైతం వెల్లడించాయి. ఏ సమయంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడవచ్చని, సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపాయి.

**ఆలస్యమైతే మరింత నష్టం**

రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసి ఏడాది దాటిపోయింది. కేంద్రం, 15వ ఫైనాన్స్ నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన నిలిచింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి 15 నెలలు దాటింది. అయినా, ఎన్నికలు నిర్వహించకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామీణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇంకా ఆలస్యమైతే మరింత నష్టం జరిగే అవకాశం ఉంటుందని ప్రభుత్వ పెద్దలకు ఫీడ్‌బ్యాక్ అందింది. ఫలితాలు ఎలా వచ్చినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు తమ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్తారని, తమపై కాస్త ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. వెంటనే ఎన్నికలకు వెళ్లాలని కొందరు ఎమ్మెల్యేలు ఒత్తిడి కూడా తీసుకొస్తున్నట్టు తెలిసింది. సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ, యువవికాసం వంటి పథకాల అమలు అంశం కలిసి వస్తుందని కూడా హస్తం నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## త్రివేణి సంగమంలో గవర్నర్ దంపతుల పుష్కర స్నానం

(మొదటి పేజి తరువాయి)

వద్దకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు చేరుకున్నారు. సరస్వతి ఘాట్‌లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పుణ్యస్నానమాచరించారు. అనంతరం సరస్వతి ఏక శిలా విగ్రహాన్ని దర్శించుకున్నారు. పుష్కర స్నానానంతరం గవర్నర్ దంపతులు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. వారికి దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్ రావు, ఆలయ పూజారులు పరిచట్టం, పూర్ణ కుంభం, మంగళవాయిద్యాలతో స్వాగతం తెలిపారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు వారికి ఆశీర్వచనం అందించి, శ్వేత వస్త్రం, లడ్డూ ప్రసాదం, చక్కెర పొంగలి అమ్మవారి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ప్రతి రోజూ సాయంత్రం నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమాన్ని వివరించారు. పుష్కర ఏర్పాట్లను గవర్నర్ పరిశీలించి అధికారులను అభినందించారు. 11 రోజుల నుంచి పుష్కరాలు వైభవంగా జరుగుతున్నాయ ని, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగాన్ని అధికారులను, సిబ్బందిని గవర్నర్ అభినందించారు.

# ఆపరేషన్ సిందూర్‌పై తీర్మానం

(మొదటి పేజి తరువాయి)

కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్, 19 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు ఉప ముఖ్య మంత్రులు పాల్గొన్నారు. ఏపీ నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం ఆపరేషన్ సిందూర్‌పై తీర్మానాన్ని ఆమోదించింది. ఆపరేషన్ సిందూర్ విజయంలో సాయుధ బలగాలు ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసా లను, ప్రధాని మోడీ నాయకత్వాన్ని అభినందిస్తూ ఈ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని శివసేన నేత, మహారాష్ట్ర ఉప ముఖ్య మంత్రి ఏక్‌నాథ్ శిండే ప్రవేశపెట్టారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశ ప్రజల్లో నైతిక, ఆత్మస్థైర్యం పెరిగిందని ఈ తీర్మానం పేర్కొన్నది. మోడీ నాయ కత్వాన్ని ప్రశంసిస్తూ, సాయుధ బలగాలను ప్రధా ని వెన్నంటి ప్రోత్సహిస్తూ వచ్చారనీ, ఉగ్రవాదులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహి స్తున్న వారికి ఆపరేషన్ సిందూర్ గట్టి సమాధానం ఇచ్చిందని వివరించింది. పలువురు రాష్ట్ర మంత్రులు తమతమ రాష్ట్రాల్లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాలను ఈ సమావేశంలో వివరించారు. ఏప్రిల్ 22న పహ ల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి ఘనంగా నివాళులర్పించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి ఈ సమావేశం జరిగింది.

**నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ: పవన్**

భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. నిటి ఆయోగ్ ప్రకారం భారత జీడీపీ ప్రస్తుతం 4.18 ట్రిలియన్‌కు చేరుకుందని గుర్తుచేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని ప్రధాని మోడీ దూరదృష్టి గల నాయకత్వం, అలాగే 2014 నుంచి ఎన్డీఏ ప్రభుత్వ ప్రగతిశీల పాలన నిదర్శనంగా చెప్పుకోవచ్చని తెలిపారు. గత దశాబ్దంలో, ఎన్డీఏ ప్రభుత్వ సుపరిపాలన కింద, భారత్ అభివృద్ధి పయనాన్ని నాలుగు ముఖ్యమైన అంశాలు నడిపించాయని వివరించారు. భారత్ వృద్ధి కథ, ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, చేరిక, డిజిటల్ పరివర్తనతో నడిచిందని అన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి, వికసిత్ భారత్ %-% 2047 వైపు నడిపించడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు.

# పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చూడండి

(మొదటి పేజి తరువాయి)

సబ్‌కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరైన ఈ సమావేశంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధితోపాటు ఇప్పటివరకు కుదుర్చుకున్న ఎంవోయూల అమలు, కొత్త పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఇక నుంచి ప్రతీ శనివారం ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సమావేశాన్ని నిర్వహిద్దామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హ్యుందాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ స్థాపనకు సబ్‌కమిటీ ఆమోదం తెలిపింది. రూ.8,528 కోట్ల పెట్టుబడితో 675 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ఆర్అండ్‌డీ కేంద్రం ద్వారా కొత్తగా 4,276 మంది యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, డైరెక్టర్ మల్సూర్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాసర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల

(మొదటి పేజి తరువాయి)

పంజాబ్, పశ్చిమబెంగాల్‌లోని ఐదు నియోజకవర్గాలకు జూన్ 19న పోలింగ్, జూన్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్టు ఈసీ ప్రకటించింది. ఉప ఎన్నికలు జరగనున్న ఐదు నియోజకవర్గాల్లో రెండు గుజరాత్‌లోనే ఉన్నాయి. కాడి (రిజర్వ్ సీటు), విశావదర్‌లతో పాటు కేరళలోని నిలంబూర్, పంజాబ్‌లో లూథియానా వెస్ట్, పశ్చిమబెంగాల్‌లోని కాలిగం జ్ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నట్లు ఈసీఐ ఆదివారం తన ఎక్స్ ఖాతా లో పోస్ట్ చేసింది. గెజిట్ నోటిఫికేషన్‌ను ఈ నెల26న విడుదల చేయనున్నట్టు తెలిపింది. నామినేషన్ల దాఖలు చేయడానికి చివరి తేదీ జూన్ 2, నామినేషన్ల పరిశీలన తేదీ జూన్ 3, నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీ జూన్ 5.

## సంపాదకీయం

# రాజస్థాన్ 'కోట'లో ఆత్మహత్యలు ఆపలేమా?

రాజస్థాన్ నడిబొడ్డున ఉన్న కోట నగరం దశాబ్దాలుగా లక్షలాది యువత ఆశయాల నిలయంగా మారింది. దేశ 'కోచింగ్ రాజధాని'గా పేరొందిన ఈ నగరంలో 2023లో 26 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, ఈ ఏడాది ఇప్పటికే 14 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఇది జాతీయ స్థాయిలో ఆందోళన రేకెత్తించి, సుప్రీంకోర్టు తీవ్ర విమర్శలు చేసే వరకూ వెళ్లింది.

**-సుప్రీంకోర్టు ప్రశ్నలు**

భారత సుప్రీంకోర్టు కోటలో విద్యార్థుల ఆత్మహత్యల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ మే 23న రాజస్థాన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. "ఈ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు? కోటలో మాత్రమే ఎందుకు? రాష్ట్ర ప్రభుత్వంగా మీరేం చేస్తున్నారు?" వంటి పలు ప్రశ్నలను సంధించింది. అనేక చర్యలు ప్రకటించినప్పటికీ, విద్యార్థుల బలవన్మరణాలు నిరంతరంగా చోటు చేసుకోవడం సుప్రీంకోర్టు జోక్యానికి దారితీసింది.

**-కోట-ఆశయాల కేంద్రం**

ఐఐటి, ఎయిమ్స్ వంటి దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్న ఆలోచన నుండి 'కోట' ఉద్భవించింది. మాజీ ఇంజనీర్ వి.కె. బన్సాల్‌ను కోట కోచింగ్ పరిశ్రమ పితామహుడిగా పరిగణిస్తారు. ఆయన విజయం బన్సాల్ క్లాసెస్ స్థాపనకు దారితీసింది. ఇది ఇతరులకు నమూనాగా మారింది.

**-కోచింగ్ కేంద్రాలు-ఒత్తిడి**

తాజా నివేదికల ప్రకారం, కోటలో 250కి పైగా నమోదిత కోచింగ్ సంస్థలు ఉన్నాయి. నమోదు కాని, చిన్నా చితకా కేంద్రాలకు లెక్కే లేదు. అగ్రశ్రేణి కోచింగ్ కేంద్రాలు ఆధునిక తరగతి గదులు, గ్రంథాలయాలు, హాస్టల్ సౌకర్యాలు అందిస్తున్నప్పటికీ, విద్యార్థుల జీవన పరిస్థితులలో చాలా తేడాలుంటాయి. విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో లేదా పేయింగ్ గెస్ట్ వసతులలో నివసిస్తున్నారు. విద్యా విషయాలపై మాత్రమే దృష్టి ఉంటుంది.

**-విద్యార్థుల్లో ఒత్తిడి**

కోట విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. రోజుకు 12-18 గంటల తీవ్రమైన అధ్యయన షెడ్యూళ్లు, వారపు పరీక్షలు, నిరంతర ర్యాంకింగ్, నిరంతర పోటీ, పనితీరు ఆందోళన వాతావరణాన్ని సృష్టిస్తాయి. మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు కోట కోచింగ్‌లో తమ జీవితకాల పొదుపును పెట్టుబడిగా పెడతారు. తమ పిల్లలు విజయం సాధించాలన్న ఒత్తిడి ఉంటుంది. మొదటిసారి ఇంటికి దూరంగా, కుటుంబం, పరిచయస్తులకు దూరంగా ఉండటం తీవ్రమైన ఒంటరితనం, ఇంటిపై బెంగకు దారితీస్తుంది. కోచింగ్ పరిశ్రమ లాభాల ఆధారిత నమూనా విద్యార్థుల శ్రేయస్సును విస్మరిస్తుంది. ఈ పరీక్షలలో వైఫల్యం జీవితంలో వైఫల్యానికి సమానమనే నమ్మకం నిరాశ నిస్సహాయ భావాలకు దారితీస్తుంది.

**-విషాదానికి మూల కారణాలు**

ఆత్మహత్యల పెరుగుదలకు కారణాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. నిరంతర మూల్యాంకనాలు, ర్యాంకుల బహిరంగ ప్రదర్శనలు ప్రమాణాలను అందుకోలేకపోతామనే భయాన్ని పెంచుతాయి. కుటుంబ మద్దతు లేకపోవడం, గంటల తరబడి ఒంటరిగా చదువుకోవడం వల్ల ఏకాంతం ఒంటరితనం పెరుగుతాయి. మానసిక ఆరోగ్య సమస్యలకు సహాయం కోరడానికి సామాజిక చిన్నచూపు, తల్లిదండ్రుల అపార్థాల కారణంగా సంకోచం ఉంటుంది. కఠినమైన షెడ్యూళ్ల కారణంగా విశ్రాంతి, వినోదం, భావోద్వేగ ప్రక్రియకు చాలా తక్కువ సమయాన్ని ఇవ్వడంతో అలసట కలుగుతుంది. ఆదేశాలు ఉన్నప్పటికీ, అర్హత కలిగిన కౌన్సిలర్లు, వైద్యుల లభ్యత సరిపోవడం లేదు.

**-ఇప్పటివరకు తీసుకున్న చర్యలు**

విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో రాజస్థాన్ ప్రభుత్వం, కోచింగ్ సంస్థలు వివిధ చర్యలను అమలు చేశాయి. కోచింగ్ కేంద్రాలకు కొత్త మార్గదర్శకాలు జారీ అయ్యాయి. వీటిలో తప్పనిసరి వారపు సెలవులు, పరీక్షల సమయ నియంత్రణ, పనితీరు ఆధారంగా విద్యార్థులను విభజించకపోవడం, తప్పనిసరి కౌన్సిలింగ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, కోచింగ్ కేంద్రాలలో వృత్తిపరమైన మానసిక వైద్యులు, కౌన్సిలర్లను తప్పనిసరిగా నియమిస్తున్నారు. ప్రమాదంలో ఉన్న విద్యార్థులను గుర్తించడానికి సిబ్బందికి గేట్ కీపర్ శిక్షణ నిర్వహిస్తున్నారు. హాస్టళ్లకు "ఆత్మహత్య-నిరోధక" సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందులో సీలింగ్ ఫ్యాన్‌లకు స్ప్రింగ్-లోడెడ్ పరికరాలు, బాల్కనీలలో లాబీలలో ఆత్మహత్య ప్రయత్నాలను భౌతికంగా నిరోధించడానికి వలలను అమర్చడం వంటివి ఉన్నాయి. పర్యవేక్షణలో భాగంగా, హాస్టల్ వార్డెన్ల ద్వారా విద్యార్థులను తనిఖీ చేయడానికి "దర్వాజే పే దస్తక్" వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మహిళా విద్యార్థుల భద్రత కోసం పోలీసుల "కాలికా స్క్వాడ్" కూడా పనిచేస్తుంది. ప్రభుత్వ చట్ట పరంగా, ఈ చర్యలు ప్రశంసనీయమైనప్పటికీ%ూ%అమలులో తరతమ తేడాల వల్ల తీవ్రమైన పోటీ, అవాస్తవ అంచనాలు, ఒత్తిడిని నడిపించే వాణిజ్యీకరణ వంటి సమస్యలను పరిష్కరించవనే విమర్శ వినిపిస్తోంది.

**-ముందుకెళ్లే మార్గం**

కోటలో ఆత్మహత్యలను నిరోధించాలంటే వ్యవస్థాగత విద్యా సంస్కరణలు చేపట్టాలి. ఇందులో జె.ఇ.ఇ, నీట్ వంటి వాటి ఏకైక దృష్టిని తగ్గించడం, వృత్తి శిక్షణ, నైపుణ్య ఆధారిత విద్య, చిన్న వయస్సు నుండే ప్రత్యామ్నాయ వృత్తి మార్గాలను ప్రోత్సహించడం వంటివి ఉంటాయి. బట్టీ పట్టడం కాకుండా సామాజిక-భావోద్వేగ అభ్యాసం, విమర్శనాత్మక ఆలోచన, జీవిత నైపుణ్యాలను పాఠ్య ప్రణాళికలో చేర్చడం ద్వారా సమగ్ర అభ్యాసాన్ని ప్రోత్సహించాలి. పరీక్షా నిర్మాణాలను, గ్రేడింగ్ విధానాలను తిరిగి మూల్యాంకనం చేసి విద్యార్థులపై భారాన్ని తగ్గించాలి. తల్లిదండ్రులు, సమాజం ఆలోచనలను మార్చడం అత్యవసరం. విజయం విస్తృత నిర్వచనాన్ని ప్రోత్సహించాలి, తద్వారా ప్రతి బిడ్డ వారి పరీక్ష ఫలితాలతో సంబంధం లేకుండా విలువైనదిగా భావించే సంస్కృతిని పెంపొందించవచ్చు. మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాల పట్ల అవగాహన కల్పించాలి. అర్హత కలిగిన మనస్తత్వవేత్తలు, మనోవ్యాధి వైద్యులు, కౌన్సిలర్లను విద్యార్థులందరికీ తగినంత సంఖ్యలో సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలి. కోచింగ్ సంస్థలకు స్పష్టమైన నిబంధనలు, జవాబుదారీతనం అవసరం. ప్రస్తుత కొత్త మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలి, నిబంధనలను పాటించని వారికి గణనీయమైన జరిమానాలు విధించాలి.

# ఎల్ఐసీ గిన్నిస్ రికార్డు

**తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు**




ఎల్ఐసీ ఆఫ్ ఇండియా ఒక్కరోజులోనే 5,88,107 పాలసీల ద్వారా వెయ్యి కోట్ల రూపాయల ప్రీమియాన్ని 4,52,839 ఏజెంట్ల ద్వారా సేకరించి ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించింది. దీనికి సంబంధించి ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మహంతికి ధ్రువీకరణ పత్రాన్ని గిన్నిస్ బుక్ నిర్వాహకులు అందజేశారు. జనవరి 20న దేశవ్యాప్తంగా "మాడ్ మిలియన్ డే" పేరుమీద నూతన వ్యాపారాన్ని సేకరించే లక్ష్యంతో ఏజెంట్లందరినీ పుర మాయించి ఎల్ఐసీ ఈ ఘనత సాధించింది. ఆ కార్యక్రమాన్ని దిగ్విజం చేసిన ఉద్యోగులు, ఏజెంట్లు, మార్కెటింగ్ అధికారులు సర్వదా అభినంద నీయులు. ఎల్ఐసీ రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని రికార్డులను నెలకొల్పే అవకాశముందని దీని ద్వారా ప్రస్ఫుటమవుతున్నది.

గతేడాది ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ) ఏజెంట్ల కమిషన్, తదితర మార్పులను ఏకపక్షంగా అమలు చేసింది. దీంతో సంస్థలో కొంత నిస్పృహ పూరిత వాతావరణం నెలకొంది. మరోవైపు చట్టాల్లో పెనుమార్పులు తీసుకొచ్చి విదేశీ పెట్టుబడికి అనుకూలంగా ఇన్సూరెన్స్ రంగాన్ని మార్చే ప్రయత్నాలను కేంద్రం ముమ్మరం చేసింది. ఇన్సూరెన్స్ ప్రీమి యంపై జీఎస్టీని తగ్గించడంపై తాత్సారం చేస్తున్నది. అవసరం లేకున్నా జరిపిన వాటాల ఉపసంహరణ (ఐపీఓ) కూడా ఎల్ఐసీకి నష్టదాయకమే. ప్రతికూల పరిస్థితులన్నింటి మధ్య ఒక్క రోజులోనే మహత్తర రికార్డును సాధించడానికి నెహ్రూ స్థాపించిన ఈ ఆధునిక దేవాల యం పట్ల ప్రజలకున్న విశ్వాసమే కారణం.ఎల్ఐసీలో మెజారిటీ కార్మిక సంఘమైన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ప్రతి సంవత్సరం జనవరి 19ని ఇన్సూరెన్స్ బిజినెస్ జాతీయ దినోత్సవాన్ని నిర్వ



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హిస్తూ నూతన వ్యాపార విస్తరణ కోసం కృషిచేస్తున్నది. చైర్మెన్ పిలుపు మేరకు సదరు దినోత్సవాన్ని జనవరి 20న జరపాలని సభ్యులందర్నీ పురమాయించి ఈ మహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడంలో ప్రధాన పాత్ర పోషించింది.

పాలసీదారులకు గట్టి నమ్మకదారిగా ఉంటూ ప్రతిఫలాత్మక ఫలితాలను ఇవ్వడంలో ముందున్న ఎల్ఐసీలోకి యుకరక్తం రావాల్సిన ఆవశ్యకత ఉంది. రానున్న పదేండ్లలో పెద్ద సంఖ్యలో ఎల్ఐసీలో ఖాళీలు ఏర్పడబోతున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి. కానీ, కేంద్రం ఈ విషయంలో సహ కరించక పోవడం దురదృష్టకరం. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించుకునేందుకు, కొత్త నియామకాలను చేపట్టేందుకు, ప్రతిభావంతులైన ప్రస్తుత సిబ్బందిని మరింత కార్యోన్ముఖులను చేసేందుకు ఎల్ఐసీకి స్వయం ప్రతిపత్తి కల్పించడం ఎంతో అవసరం. ఇది దేశ ఆర్థిక స్వావలంబనను పరిపుష్టం చేసే అంశం.మనదేశంలో ఇన్సూరెన్స్ రంగంలో ఎల్ఐసీతో పాటు మరో 26 కంపెనీలు న్నాయి. ఎల్ఐసీ ఒక్కరోజులో సాధించిన ఘనతను కొన్ని కంపెనీలు ఏడాది మొత్తం పనిచేసినా సాధించట్లేదు. దీన్నిబట్టే ఎల్ఐసీ పట్ల ప్రజలకున్న విశ్వాసమేంటో అర్థమవుతున్నది. ప్రయివేటు కంపెనీల వ్యాపా రాల్లో యాభై శాతం తప్పుదోవలోనే జరుగుతున్నట్టు పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక సర్వే ఎత్తిచూపింది. ఆ కంపెనీల్లో సిబ్బంది తొలగింపు నిష్పత్తి కూడా ఎక్కువే. పైగా, అవి పట్టణ ప్రాంతాలకే పరిమితం. ఎల్ఐసీ మాత్రం తన లక్ష్యాన్ని ఏనాడు కూడా మర్చిపోలేదు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ మంది ప్రజలకు ఇన్సూ రన్స్ కవరేజీ అందించే బాధ్యతను భుజాన వ్టేసుకున్నది. ఇలాంటి తరు ణంలో ఎల్ఐసీని కేంద్ర ప్రభుత్వం బలపర్చడం దేశ భవిష్యత్తుకు అవసరం.

# కుమారుడు తేజ్ ప్రతాప్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన లాలూ యాదవ్

**పాట్నా 25 మే- ప్రజా స్వేచ్ఛ**

తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ ప్రకటించారు. పార్టీ నుంచి ఆరేండ్లపాటు బహిష్కరణ విధిస్తున్నట్టు ఆదివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. కుటుంబంతో కూడా ఎలాంటి సంబంధాలు ఉండవని తెలిపారు. వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించేలా తేజ్ ప్రతాప్‌యాదవ్ ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతని ప్రవర్తన కుటుంబ విలువలు, సాంప్రదాయాలకు అనుగుణంగా లేవని మండిపడ్డారు. సామాజిక న్యాయం కోసం తమ పార్టీ చేస్తున్న పోరాటాన్ని తేజ్ ప్రతాప్ చర్యలు



బలహీనపరుస్తున్నాయని అన్నారు. కాగా అనుష్కయాదవ్, తాను 12 ఏండ్లుగా ప్రేమలో ఉన్నామని తేజ్ ప్రతాప్ యాదవ్ శనివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. తన ఫేస్‌బుక్ ఖాతా హ్యాకింగ్‌కు గురైందని, తన కుటుంబాన్ని, తనను కించపరిచేలా ఫొటోలను ఎడిట్ చేశారని ఆయన తెలిపారు.

**ఇలాంటివి సహించలేం :** సోదరుడు తేజ్ ప్రతాప్ బహిష్కరణపై తేజస్వి యాదవ్

ఆర్జేడీలో కీలకంగా వ్యవహరించే లాలూ రెండో కుమారుడు తేజస్వి యాదవ్ ఈ సంఘటనపై స్పందించారు. తన సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పెద్దవాడని, సొంత నిర్ణయాలు తీసుకునే హక్కు ఆయనకు ఉందని తెలిపారు. అయితే బహిష్కరణపై తండ్రి నిర్ణయం చెల్లుతుందని చెప్పారు. ఇలాంటి వాటిని పార్టీ సహించదని అన్నారు. బీహార్ ప్రజల కోసం తాము అంకితభావంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

# మధ్యప్రదేశ్‌లో నిర్భయ తరహా ఘటన

**గిరిజన మహిళపై దారుణంగా హత్యాచారం**

**భోపాల్ 25 మే- ప్రజా స్వేచ్ఛ**



బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఓ గిరిజన మహిళను ఇద్దరు వ్యక్తులు అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి, హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఖాండ్వా జిల్లా, ఖల్వా గిరిజన ప్రాంతంలో శనివారం రాత్రి 1 గంట సమయంలో ఈ దారుణం జరిగింది. ఢిల్లీ 'నిర్భయ' కేసు తరహాలో, బాధితురాలిపై అత్యాచారం జరిగింది. నిందితులు ఆమెను పొరుగింట్లోకి తీసుకెళ్లి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. మర్మాంగాల్లో ఐరన్ రాడ్‌ను గుచ్చారు.ఆమె కడుపును కోసేసి, ఆమె పక్కన చెల్లాచెదురుగా పడేశారు. రక్తపు మడుగులో పడి, స్పృహ కోల్పోయిన ఆమెను ఆమె కుమార్తె చూసింది. గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కానీ అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయారు. పోస్ట్‌మార్టం పరీక్షల కోసం మృతదేహాన్ని జిల్లా దవాఖానకు తరలించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితులిద్దరూ బాధితురాలికి పరిచయస్థులేనని స్థానికులు తెలిపారు.


# కుంచించుకుపోతున్న పసిఫిక్!

**-ఫలితంగా కొత్త ఖండం ఆవిర్భావం!**

**-ఓ20-30 కోట్ల ఏండ్లలో సూపర్ కాంటినెంట్ అమేసియా ఏర్పాటు**

**చైనా, ఆస్ట్రేలియా శాస్త్రవేత్తల అంచనా**

**న్యూఢిల్లీ 25 మే- ప్రజా స్వేచ్ఛ**




ఫలితంగా రానున్న 20-30 కోట్ల సంవత్సరాల్లో కొత్తగా సూపర్ కాంటినెంట్ ఆవిర్భవిస్తుంది. ఆస్ట్రేలియాలోని కర్టిన్ విశ్వవిద్యాలయం, చైనాలోని పెకింగ్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అడ్వాన్స్‌డ్ సూపర్‌కంప్యూటింగ్ మోడల్స్‌ను వినియోగించి ఈ అంచనా వేశారు. నేషనల్ సైన్స్ రివ్యూ జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది.ఈ పరిశోధకుల్లో ఒకరైన డాక్టర్ చువాన్ హువాంగ్ మాట్లాడుతూ, ప్రతి 60 కోట్ల సంవత్సరాలకు ఒక సూపర్ కాంటినెంట్ ఏర్పడుతుందని, ఇది ఏర్పడటం కోసం 200 కోట్ల సంవత్సరాల కాలంలో భూమిపైగల ఖండాలు ఒకదానితో మరొకటి ఢీకొన్నాయన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ఖండాలు కూడా మరో 20 కోట్ల సంవత్సరాల్లో మళ్లీ ఒక చోటుకు చేరుతాయని చెప్పారు. ఫలితంగా ఏర్పడే కొత్త సూపర్ కాంటినెంట్‌కు అమేసియా అని పేరు పెట్టినట్లు తెలిపారు. అమెరికా, ఆసియా ఢీకొన్నపుడు పసిఫిక్ మహాసముద్రం అంతరించిపోతుందని కొందరు విశ్వసిస్తున్నందువల్ల ఈ పేరు పెట్టామన్నారు. పసిఫిక్ మహాసముద్రం మూతపడితే, ఆస్ట్రేలియా మొదట ఆసియాను ఢీకొడుతుందని, ఆ తర్వాత అమెరికా, ఆసియా ఖండాలను కలుపుతుందని చెప్పారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్ సర్కార్ శుభవార్త..!

**25 మే- ప్రజా స్వేచ్ఛ -హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పడానికి రెడీ అవుతున్నారు. వారు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెండింగ్ డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) లలో ఒకదాన్ని విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే ఆర్థిక శాఖ సమీక్ష జరిపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. డీఏ ప్రకటనతో పాటుగా.. ఉద్యోగులకు సంబంధించిన ఇతర బకాయిల చెల్లింపులు, అలానే పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు.. వారికి ఇవ్వాల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాల విడుదలపై కూడా రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. వీటితో పాటుగా ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత కోసం.. తెలంగాణ సర్కార్ కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని తీసుకువచ్చేందుకు రెడీ అవుతోంది. దీనిపై జూన్ 2న ప్రకటన ఉండే అవకాశం ఉంది అంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ప్రభుత్వం.. ఉద్యోగుల సమస్యల పరిష్కారాల కోసం ఓ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలసిందే. దీనిలో ముగ్గురు ప్రభుత్వ ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే ఈ కమిటీ ఇప్పటికే అనేకసార్లు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై.. వారి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి


అభ్యర్థనలను విన్నది. ఈ కమిటీ ఉద్యోగుల ముఖ్యమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించినట్లు.. ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. త్వరలోనే ఈ కమిటీ ఉద్యోగులు సమస్యల గురించి సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక అందజేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నివేదికను ఆమోదించిన తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.. దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాల వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ప్రకటనలు అన్ని జూన్ 2న న వెలుడే అవకావం ఉందంటున్నారు. ఇదే జరిగితే ప్రభుత్వ ఉద్యోగులు పండగ చేసుకుంటారని అంటున్నారు. అంతేకాక రేవంత్ రెడ్డి చేసే ప్రకటన వల్ల.. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు లబ్ది పొందుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కరోనా కేసులు పెరుగుతున్నాయ్.. జర జాగ్రత్త..!

**తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు**

**25 మే- ప్రజా స్వేచ్ఛ -హైదరాబాద్**

కరోనా రీ ఎంట్రీ మళ్లీ కలకలం రేపుతోంది. కొత్త రూపంలో పంజా విసురుతోంది. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులే అందుకు నిదర్శనం. పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా పట్టణాల్లోనే కరోనా కేసులు నమోదు అవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రెండు కొత్త వేరియంట్లలో కరోనా ప్రభావం చూపిస్తున్నట్లు ఇండియన్ జీనోమిక్స్ కన్సార్టియం నిపుణులు గుర్తించారు. NB.1.8.1, LF.7 అనే కరోనా వేరియంట్స్ ను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే.. జేఎన్.1 వేరియంట్ కేసులు నమోదయ్యాయి.. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీలో కేసులు పెరుగుతున్న దృష్ట్యా.. అప్రమత్తంగా ఉండాలని.. అన్ని సౌకర్యాలతో ఆస్పత్రులను సిద్ధం చేసుకోవాలంటూ అధికారులు సూచనలు జారీ చేశారు. దేశంలోనే అత్యధికంగా కేరళలో కరోనా ఇన్‌ఫెక్షన్లు వెలుగులోకి వస్తున్నాయి. కేరళలో 200మందికి పైగా కరోనా లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. దాంతో.. ఆస్పత్రుల్లో మాస్కులు తప్పనిసరి చేసింది కేరళ ప్రభుత్వం.. మహారాష్ట్రలోనూ కరోనా కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఒక్క ముంబైలోనే ఈ నెలలో 95 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కర్ణాటకలో 35 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఢిల్లీలో 24 గంటల్లో 23 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

పలు జిల్లాల్లో కరోనా కేసులు నమోదు అవుతుండగా.. నోయిడాలో తొలి కరోనా కేసు రికార్డ్ అయింది. గాజియాబాద్‌లో ఇప్పటికే 4 కేసులు నమోదు అయ్యాయి. తమిళనాడులో సైతం కేసులు పెరుగుతున్నాయి.. దీంతో ఆయా ప్రభుత్వాలు ఇప్పటికే అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. భారతదేశంలో రెండు కొత్త COVID-19 వేరియంట్లు – NB.1.8.1, LF.7 - కనుగొనబడ్డాయని.. ఇప్పటివరకు దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.. కనీసం 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేసులు వెలుగు చూశాయి. ఇదిలాఉంటే.. కోవిడ్ సంబంధిత లక్షణాలతో ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు పేర్కొంటున్నారు. దీనిపై అధికార సమాచారం రావాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల్లోనూ మళ్లీ కరోనా కలవరం మొదలైంది. తెలంగాణలో తొలి కరోనా కేసు నమోదైంది. విశాఖలో 2 కరోనా కేసులు, కడపలో రెండు కేసులు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. అలెర్ట్ అయిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు.. విశాఖ జీజీహెచ్‌లో కరోనా ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు.

**రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్..**

ఇక.. దేశంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో అన్ని రాష్ట్రాలను కేంద్రం అలెర్ట్ చేసింది. ముందు జాగ్రత్తగా ఆస్పత్రులు సిద్ధం చేయాలని ఆదేశించింది. అయితే.. ఆయా రాష్ట్రాల్లోని కరోనా బాధితులకు కేవలం స్వల్ప లక్షణాలు మాత్రమే ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. బాధితుల్లో ఎక్కువ మంది ఇంట్లోనే చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపింది.

# టి.ఆర్.జి.ఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా శ్రీను నాయక్

**మిర్యాలగూడ ప్రతినిధి// 25 మే- ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా ధీరావత్ శ్రీను నాయక్ ను ఎన్నుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం వ్యవస్థాపకులు ధీరావత్ రవి నాయక్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ధీరావత్ శ్రీను నాయక్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు గిరిజన సమస్యల పరిష్కారం దిశగా ఉద్యమాలు నిర్వహిస్తూ సంఘం బలోపేతం కు ముందుకు కొనసాగిస్తానని వారు పేర్కొన్నారు. అలాగే గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేసేంతవరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని




అదే విధంగా ఈ బంజారాలు మాట్లాడే గోర్ బోలి భాషను జాతీయ భాష గుర్తించాలి తండా గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామ పంచాయతీలు గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి. గిరిజన గ్రామ పంచాయతీలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారం దిశగా ఈ ప్రభుత్వం ముందుకు సాగాలని అనేక అంశాలపై అధ్యయనం చేసి గిరిజన ఉద్యమానికి బలోపేతం కోసం కృషి చేస్తానని వారు పేర్కొన్నారు. నా ఎన్నికకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం వ్యవస్థాపన అధ్యక్షులు ధీరావత్ రవి నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్ నాయక్, ఆంబోతు వెంకన్న నాయక్, జవహర్ నాయక్, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పాపన్నపేట 25 మే- ప్రజా స్వేచ్ఛ**

వారంతా చిన్ననాటి స్నేహితులు. ఒకే చోట చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాలలో స్థిరపడగా, మరి కొంతమంది వ్యాపారం ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు.కుర్తివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-2009 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు తలపించే విధంగా జరిగింది.పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి గత స్మృతులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఒకరునొకరు ఆలింగనం చేసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ స్థితిగతులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా స్కూలు గ్రౌండ్‌లో గడిపారు.పదో తరగతి పాసై 16 సంవత్సరాలు గడవడంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని,విద్యార్థులంతా ఇలా కలుసుకోవడం వల్ల స్నేహాలు బలపడతాయని తెలిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులంతా కలిసి మెమొంటోలతో,శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఆనాటి ఉపాధ్యాయులు బాలకిష్టయ్య, శివరాజ్, సంతోష్ కుమార్, సీతారాములు, పిఈటి మధు, సల్మాన్ రాజ్, పెంటయ్య, విమల మరియు పూర్వ విద్యార్థులు రేవతి, దివ్య, రజిత, అర్చన, శ్రీలత,సతీష్ కుమార్,సద్దాం హుస్సేన్, నవీన్ రెడ్డి, ముజీబ్, ఇమ్రాన్, ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువులకు సాంప్రదాయ సన్మానం




**నిర్మల్ ప్రతినిధి 25 మే- ప్రజా స్వేచ్ఛ**

నిర్మల్ జిల్లా మామడ మండలంలోని కొరటికల్ ప్రభుత్వ పాఠశాల 2006 - 07 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 18సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆధ్యాత్మిక సాంప్రదాయ పద్ధతులలో ఘనంగా సత్కరించారు. వారి ఆశీస్సులు తీసుకున్నారు.

# దైవచింతనతో మానసిక ప్రశాంతత

**-దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్...**



**చింతపల్లి 25 మే- ప్రజా స్వేచ్ఛ**


చింతపల్లి మండలం తక్కలపల్లిలో గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో. ఈదమ్మ,మడేలయ్యా,శీతలమ్మ,విగ్రహాల ప్రతిష్టాపనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు,ఈ కార్యక్రమంలో...మాల్ మార్కెట్ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి,మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్,మాజీ జెడ్పిటిసి హరినాయక్,మాజీ సర్పంచ్ నర్సిరెడ్డి,ముద్దం రవీందర్ గౌడ్, మాస భాస్కర్, మేతరి యేసు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన పోలీస్ కృష్ణ

**ఆందోల్ 25 మే- ప్రజా స్వేచ్ఛ**

ఆందోల్ నియోజకవర్గం రేగోడు మండలం చెందిన పోలీస్ కృష్ణ అలియాస్ బంకు కృష్ణ మంత్రి దామోదర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని పోలీస్ కృష్ణ అల్వేస్ బంకు కృష్ణ మన కుటుంబ సభ్యుడని పరిచయం చేసి అభినందనలు తెలిపిన పోలీస్ కృష్ణ ఈ కార్యక్రమంలో జైరాబాద్ ఎంపీ సురేష్ సిట్కర్ పాల్గొన్నారు .

## కన్నెకంటి వెంకటేశ్వరాచారిని (లీడర్స్ అవార్డు) తో ఘనంగా సన్మానించిన రాష్ట్ర విశ్వకర్మ నాలెడ్జి సెంటర్



**25 మే- ప్రజా స్వేచ్ఛ రామన్నపేట ప్రతినిధి**
అనతి కాలములోనే స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో రాజకీయాలలో విశ్వకర్మల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలు కలిగిన విశ్వకర్మలని గుర్తించి హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోనీ సన్మాన కార్యక్రమంలో విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ వ్యవస్థాపకులు విశ్వనాధుల పుష్పగిరి చారి ఇప్పటికీ 14 రాష్ట్రాలలో 410 మందిని విశ్వకర్మ లీడర్స్ ని గుర్తించి అందులో రామన్నపేటకు చెందిన విశ్వకర్మ ముద్దుబిడ్డ బ్రహ్మశ్రీ కన్నెకంటి వెంకటేశ్వరాచారిని సెలక్షన్ చేసి ప్రస్తుత ఏసిపి కిరణ్ కుమార్ చారి హైదరాబాదు మెమెంటో శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా కన్నెకంటి వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు అన్ని రంగాలలో విశ్వకర్మలు ముందుండాలని రాబోవు స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామం నుండి విశ్వకర్మల ప్రాతినిధ్యం ఉండాలని విశ్వకర్మ కార్పొరేషన్ సాధించుకోవాలని కోరారు

## సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాదయాత్ర



**25 మే- ప్రజా స్వేచ్ఛ శేరి లింగంపల్లి ప్రతినిధి**
శేరిలింగంపల్లి డివిజన్ లోగల బాపునగర్, గోపినగర్ లలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి అనంతరం డ్రైనేజీ మరియు పలు సమస్యలపై స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. స్థానిక ప్రజల నుండి వినతులు స్వీకరించారు. పారిశుధ్య పనులు క్రమంగా నిర్వహించడం లేదని, ఓపెన్ డ్రైనేజీ చెత్త నిండిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోగా, మరికొన్నింటిని త్వరలో పరిష్కరిస్తామని స్థానికులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోడ్డుకు అడ్డుగా ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్ ను తొలగించి క్రమబద్ధంగా అమర్చుటకై సంబంధిత ఏఈ వెంకట్ రామ్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసిన కార్పొరేటర్ గారు. అధికారులకు, కాంట్రాక్టర్లకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపునగర్ హనుమాన్ యూత్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, ప్రభాకర్, మహేష్ చారీ, వీరేందర్, జనార్ధన్, చంద్రయ్య, శంకరయ్య, సైదులు, దస్తగిరి, ఇమ్రాన్ స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా బంజారా సేవ సంఘ్ జాతీయ అధ్యక్షులుగా నియమితులైన మాజీ ఎంపీ ఉమేష్ జాదవ్



**25 మే- ప్రజా స్వేచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ ప్రతినిధి**
మింట్ కంపౌండ్ గిరిజన భవన్ లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడి నియామకం జరిగింది ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కలిసి ఒక ఐదు మందిని సెలక్షన్ కమిటీ సభ్యులుగా నిర్ణయించడం జరిగింది వారు మాజీ ఎంపీ ఉమేష్ జాదవ్ పేరును ఖరారు చేశారు అనంతరం ఎగ్జిక్యూటివ్ మెంబర్ అందరూ కలిసి మాజీ ఎంపీ ఉమేష్ జాదవ్ ని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షులుగా నిర్ణయించడం జరిగింది ఈ కార్యక్రమంలో శంకర్ పవర్ అమర్ సింగ్ తిలావత్ మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ రాజు నాయక్ శ్యాం నాయక్ కిషన్ సింగ్ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దళిత రత్న అవార్డు స్వీకరించిన రేవెల్ల రాజేష్



**25 మే- ప్రజా స్వేచ్ఛ శేరి లింగంపల్లి**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవము 2025 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ (జయంతి ఉత్సవాల కమిటీ) ఇటుక రాజు మాదిగ, అలాగే తెలంగాణ రాష్ట్ర 57 ఉపకులాల ఐక్యవేదిక అధ్యక్షుడు చింతల రాజలింగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దళిత రత్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గము నుండి కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ రేవెల్ల రాజేష్ ని ఎంపిక చేయడం జరిగింది, కుల పరంగా జాతి పరంగా, వర్ణ వివక్ష లేకుండా రాజకీయపరంగా తనదైన శైలిలో ముందుకు దూసుకెళ్తూ, ప్రజలకు చేదోడుగా వాదోడుగా ఉంటూ, అనేకమైనటువంటి ప్రజా సంకల్ప యాత్రలలో పాల్గొని ఆయన చేసిన పనులను ప్రశంసిస్తూ, అభినందిస్తూ, తన పనిని గుర్తిస్తూ, యావత్ తెలంగాణ రాష్ట్ర మాల,మాదిగ, దాని ఉపకులాల యొక్క ఆధ్వర్యంలో, దళిత రత్న అవార్డు వారికి అందివ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఇటుక రాజు మాట్లాడుతూ (వర్కింగ్ చైర్మన్) యువత జాతి కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తూనే సమాజాన్ని మేల్కొల్పాలని ఆయన పిలుపునివ్వడం జరిగింది ఉపకులాల నాయకుడు చింతల రాజలింగం మాట్లాడుతూ రాబోయే రోజులలో ఉపకులాల చైర్మన్ పదవిని కాంక్షించి ప్రజలకు మేలు చేసే విధంగా ముందుకు నడవాలని ఆయన కోరారు. రేవెల్లె రాజేష్ మాట్లాడుతూ ఈ అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు

# పదవి విరమణ - కేవలం పదవికి మాత్రమే ప్రజాసేవ కు కాదు

-పదవి ఉన్నా, లేకున్నా ప్రజా సేవ చేస్తా
-గ్రామ అధ్యక్ష వీడ్కోలు సమావేశంలో ఆర్.జగదీశ్వర్ రెడ్డి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెల్టూరు



**25 మే- ప్రజా స్వేచ్ఛ పెద్దమందడి ప్రతినిది**
పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామ అధ్యక్షుని గా 22 నెలలు అవకాశం కల్పించిన,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, గ్రామ ప్రజలందరికీ గ్రామ సేవ చేసేందుకు అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆర్.జగదీశ్వర్ రెడ్డి (బంగ్లా బాబు) అన్నారు.ఈ సందర్భంగా వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూగ్రామంలోని కాంగ్రెస్ పార్టీని,ఒక తాటిపైకి తీసుకొచ్చేందుకు,అందర్నీ సమన్వయం చేసుకుంటూ, ఒక కుటుంబం పెద్ద కుమారుని గా గుర్తించి,జిల్లా కాంగ్రెస్ కమిటీ నాకు ఈ పదవి నమ్మకంతో అప్పచెప్పారు. గ్రామ కాంగ్రెస్ పార్టీని క్రమశిక్షణ లోప్రతి నాయకుని, కార్యకర్తని సమన్వయం చేసుకుంటూ ఈరోజు వరకు గ్రామ కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా 22 నెలలు నాకు ఈ అవకాశం కల్పించినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలుతెలుపుతున్నాననిగ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి విరమణ పొందిన సందర్భంగా బంగ్లాబాబు అన్న మాటలు ఇవి.పెద్దమందడి మండల కేంద్రంలో ప్రతి గ్రామంలో నన్ను గుర్తించుకునేలా, మీ అందరి ఆశీర్వాదంతో నాకు ఈ పదవి ఇచ్చారు. ఘనంగా శాలువాతో సత్కరించి గ్రామ కాంగ్రెస్ నాయకులు, మరియు గ్రామ పెద్దలు విషెస్ తెలియజేశారు.నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్యా నేర్పిన గురువులకు, స్ఫూర్తి నిచ్చిన శ్రేయోభిలాషులకు & గ్రామ ప్రజలకు నమస్కరిస్తున్నాను అని ఉద్వేగంతో అన్నారు. నన్ను ఆదరించి అభిమానించి, ఆశీర్వదించి ఈ అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. పదవి విరమణ కేవలం పదవికి మాత్రమే గానీ,ప్రజాసేవ కాదని పేర్కొన్నారు. పది మందికి మంచి చేయాలనే ఉద్దేశంతోనాకు పదవి ఉన్నా లేకున్నా ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉంటూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ను గుండెల్లో పెట్టి చూసుకుంటానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు,ప్రతి నాయకుడు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆర్.మాజీ ఎంపీటీసీ సి.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి,ఎన్. విజయకుమార్, డిఎస్ మహేష్,గొల్ల మల్లన్న,ఉప్పరి రామచంద్రయ్య,పట్నం సత్యన్నా, సుంకరి యాదయ్య, ఎం.శ్రీనివాసులు, పి.మల్లికార్జున్, జి.ఆంజనేయులు, సాకి కృష్ణయ్య,జివిఎల్. అనంత రెడ్డి, జివిఎల్. మహేశ్వర్ రెడ్డి, వడ్డే శేఖర్,దిండు రవి,శశి కుమార్ రెడ్డి,మిల్లర్ రాజు,కుమ్మరి కొండన్న,సాధిక్, లాలు,తదితరులు పాలుగోన్నారు.

# వెల్టూరు కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుని ఎన్నిక

-జి.ప్రేమ్ కుమార్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెల్టూరు.
-గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.
-జి.ప్రేమ్ కుమార్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెల్టూర్



**పెద్దమందడి.25 మే- ప్రజా స్వేచ్ఛ .జిల్లా ప్రతినిధి**
పెద్దమందడి మండలం, వెల్టూరు గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జి.ప్రేమ్ కుమార్ విజయానికి కృషి చేసిన గ్రామ పెద్దలందరికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ధన్యవాదాలు అని అన్నారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, గెలిపే ప్రధాన ఏజెండగా కాంగ్రెస్ పార్టీ నాయకుడి గా, కార్యకర్త గా, సైనికుడి గా పనిచేయాలని పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే నాకు ఈ అవకాశం ఇచ్చిన గ్రామ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు, అందరితో ఐకమత్యంతో ఉంటూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కొరకు, కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో జరిగే కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు, మండల స్థాయి సమావేశాలకు, జిల్లా స్థాయి సమావేశాలకు, ముందు వరుసల ఉండి, అధ్యక్షుని హోదాలో నడిపిస్తానని ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు నా అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు, సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను అని జి.ప్రేమ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్.శ్రీనివాస్ రెడ్డి మాజీ గ్రామ సర్పంచ్, ఆర్.జగదీశ్వర్ రెడ్డి గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, కె. జగదీశ్వర్ రెడ్డి, ఆర్టీసీ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ. సి. వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్. విజయ్ కుమార్, డిఎస్.మహేష్, ఉప్పరి రామచంద్రయ్య, పట్నం సత్తన్న,గొల్ల మల్లన్న, సుంకరి యాదయ్య, ఎం.శ్రీనివాసులు, పి.మల్లికార్జున్, జి.ఆంజనేయులు, సాకే కృష్ణయ్య, జివిఎల్.అనంత రెడ్డి, జివిఎల్ మహేశ్వర్ రెడ్డి, వడ్డే శేఖర్, దిండు రవి, మిల్లర్ రాజు, కుమ్మరి

# రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలుగా నిలుపుదాం.

-4 కే ఫిట్నెస్ క్లబ్ నిర్వాహకులు ఆషన్నగారి మధుకర్ రెడ్డి



**షాద్ నగర్, 25 మే- ప్రజా స్వేచ్ఛ**
రక్తం కొరత కారణంగా ఎన్నో అమూల్యమైన ప్రాణాలు అర్ధాంతరంగా నశిస్తున్న పరిస్థితి చూస్తుంటే మనసు కలిచివేస్తోంది. అద్దం కొడతతో కీలక సమయాల్లో రక్తం అందక ఎందరో రోగులు బాధపడుతున్నారు. అలాంటి విషాద ఘటనలకు చెక్ పెట్టేందుకు, శాద్నగర్‌లోని 4K ఫిట్నెస్ నిర్వాహకుడు మధుకర్ రెడ్డి ముందుకొచ్చారు.రంగారెడ్డి జిల్లా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు ఆశన్న గారి భుజంగారెడ్డి ఆధ్వర్యంలో, మెగా రక్తదాన శిబిరాన్ని శాద్నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువత, ఫిట్నెస్ ప్రియులు, సామాజిక కార్యకర్తలు విస్తృతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుకర్ రెడ్డి మాట్లాడుతూ....రక్తదానం ద్వారా మనం ఒక ప్రాణాన్ని కాపాడగలుగుతాం. ప్రతి వ్యక్తి ఏడాదిలో కనీసం ఒక్కసారి రక్తం దానం చేయగలిగితే, రాష్ట్రంలో రక్త కొరత సమస్యకి స్థిర పరిష్కారం లభించవచ్చని పేర్కొన్నారు.ఈ శిబిరాన్ని చూసి పలువురు యువత ప్రేరణ పొందారని, 4 కే ఫిట్నెస్ వంటి ఫిట్‌నెస్ సెంటర్లు ఇటువంటి సామాజిక బాధ్యత గల కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని యువ నేత లక్ష్మణ్ కుమార్ ప్రశంసించారు.మంచి ఆరోగ్యం కంటే గొప్ప సేవ ప్రాణదానం లేదు.రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన ప్రతి ఒక్కరూ నిజమైన హీరోలే, అని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన యూనిట్లు తలసీమియా, రోడ్డు ప్రమాద బాధితులు, అత్యవసర శస్త్రచికిత్సలలో ఉన్న రోగులకు అందించనున్నారు ఇట్టి కార్యక్రమంలో రఘువీర్ రెడ్డి,ముక్తేశ్వర వంశీ గౌడ్,వేణు గోపాల్ ,కోట భరత్,హాజిపల్లి నవీన్ తదితరులు పాల్గొనారు...

# బిజినెస్

## ఐఫోన్ లుక్‌లో లావా ఫోన్..
# ఫీచర్స్ అదిరిపోయాయిగా..!

లావా కంపెనీ షార్క్ 5జీ పేరుతో బడ్జెట్ ప్రియులను ఆకట్టుకునేందుకు ఐఫోన్ డిజైన్‌తో మరో స్మార్ట్ ఫోన్ లాంచ్ చేసింది. కేవలం రూ. 7,999కే ఈ ఫోన్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. షార్క్ 5జీ మే 23 నుంచి చాలా రిటైల్ అవుట్‌లెట్‌లతో పాటు లావా ఆన్‌లైన్ స్టోర్ ద్వారా అందుబాటులో ఉంటుందని కంపనీ ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా వారెంటీ స్కీమ్‌లో భాగంగా హెూమ్ రిపేర్ సర్వీస్ కూడా ఉంది. షార్క్ రూ. 10,000 కంటే తక్కువ ధరకు 5జీ కనెక్టివిటీని అందించే అతి కొద్ది స్మార్ట్‌ఫోన్‌లలో లావా షార్క్ 5జీ నిలుస్తుంది. ఈ ఫోన్ రెడ్‌మీ ఏ4 5జీ, రెడ్‌మి 14సీ 5జీ ఫోన్స్‌కు గట్టి పోటీనిస్తుందని నిపుణులు చెబుతున్నారు. షార్క్ 5జీ ఎంట్రీ-లెవల్ 5జీ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌కు ఐఫోన్ 16



లాగా కనిపించే డిజైన్‌తో ఆకట్టుకుంటుంది. స్టెల్లార్ గోల్డ్, బ్లూ రంగుల్లో ఈ ఫోన్ కొనుగోలుకు అందుబాటులో ఉంటుంది. ఈ ఫోన్ పెద్ద కెమెరా హంప్‌తో పాటు రెండు లెన్స్‌లతో నిగనిగలాడే బ్యాక్ ప్యానెల్‌తో ఆకట్టుకుంటుంది. ఫీచర్స్ విషయానికి వస్తే షార్క్ 5జీ 90 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో 6.7 అంగుళాల హెచ్‌డీ ప్లస్ రిజుల్యూషన్ ఎల్‌సీడీ డిస్‌ప్లేతో వస్తుంది. 6 ఎన్‌ఎం యూనిసాక్ టీ765 చిప్‌సెట్‌తో వచ్చే ఈ ఫోన్ పని తీరు విషయంలో రాజీ ఉండదని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. 4 జీబీ ం 64 జీబీ వేరియంట్‌లో లభించే ఈ ఫోన్‌లో 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ పవర్ బ్యాకప్‌తో ఆకట్టుకుంటుంది. అలాగే 10 వాట్స్ చార్జర్‌తో వచ్చే ఈ ఫోన్ 18 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్‌కు మద్దతునిస్తుంది. ఆండ్రాయిడ్-15తో పని చేసే ఈ ఫోన్ కెమెరా విషయానికి వస్తేంది13 ఎంపీ ప్రైమరీ కెమెరాతో పాటు 5 ఎంపీ ఫ్రంట్ కెమేరాతో వస్తుంది. వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెన్స్ కోసం ఈ ఫోన్ ఐపీ-54 సర్టిఫికేషన్‌తో వస్తుంది. రెండు రంగుల్లో అందుబాటులో ఉండే ఈ ఫోన్ ఒకే స్టోరేజ్ వేరియంట్‌లో అందుబాటులో ఉంటుంది. షార్క్ 5జీ ఫోన్ లావా ఆన్‌లైన్ స్టోర్‌తో పాటు వివిధ రిటైల్ అవుట్‌లెట్‌ల కొనుగోలుకు అందుబాటులో ఉంది.

## బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..



దేశంలో కొన్ని రోజులుగా బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. స్వల్ప హెచ్చుతగ్గులు మినహా సామాన్యులకు అందనంత ఎత్తులోనే ఉంటున్నాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, 25, 5, 2025) 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.98,080గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర 89,900గా ఉంది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల గోల్డ్ ధర రూ.73,560.. కిలో వెండి ధర రూ 99,900కు చేరుకుంది.

**దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (24కే, 22కే, 18కే)**

చెన్నై: 9,808 -8,990-7,410
ముంబై: 9,808-8,990-7,356
ఢిల్లీ: 9,823-9,005-7,368
కోల్‌కతా: 9,808-8,990-7,356
బెంగళూరు: 9,808-8,990-7,356
హైదరాబాద్: 9,808-8,990,-7,356
కేరళ: 9,808-8,990-7,356
పూణే: 9,808-8,990-7,356
వడోదరా: 9,813-8,995-7,360
అహ్మదాబాద్: 9,813-8,995-7,360

## ఇండియన్ స్టారప్‌తో జతకట్టిన యమహా. త్వరలో ఈవీ రంగంలోకి ఎంట్రీ?

యమహా కంపెనీ త్వరలో రివర్ ఇండి ఆధారంగా సరసమైన ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. రాబోయే యమహా ఈవీకు ఆర్‌వై 01 అనే కోడే నేమ్ కూడా ఉంది. రివర్ ఇండి ఈవీ స్కూటర్ మాదిరిగానే బ్యాటరీ నిర్వహణ వ్యవస్థ, పవర్ ట్రెయిన్‌ను ఉపయోగిస్తుందని పలు నివేదికల ద్వారా స్పష్టమైంది. జపాన్‌కు చెందిన యమహా మోటార్ కంపెనీ ఫిబ్రవరి 2024లో రివర్ ఇండి కంపెనీ సుమారు 40 మిలియన్ల డాలర్ల పెట్టుబడి పెట్టింది. రివర్ ఇండీ భాగస్వామ్యంతో కొత్త యమహా ఆర్‌వై01 ఎలక్ట్రిక్ స్కూటర్ ఈ పండుగ సీజన్‌తో ఉత్పత్తి ప్రారంభించి ఈ సంవత్సరం చివరి నాటికి లాంచ్ అవుతుందని భావిస్తున్నారు. ఈ కొత్త ఈవీ భారతదేశం, అమెరికా, యూరప్లోని యమహా గ్లోబల్ ఇంజనీరింగ్ బృందాలు




అభివృద్ధి చేస్తున్నాయి. యమహా డిజైన్ మరియు బ్రాండ్ ఎథోస్‌తో వచ్చే ఈ స్కూటర్ లాంచ్ అయినా ఇంజనీరింగ్, టెస్టింగ్, పరిశోధన, అభివృద్ధి, అన్నీ రివర్ కంపెనీ ద్వారా నిర్వహిస్తారు. డిజైన్ ఫైనల్ అయిన తర్వాత యమహా ఆర్‌వై ఈవీ స్కూటర్‌ను బెంగళూరులోని రివర్ కంపెనీ తయారు చేస్తుంది. ఇక్కడి నుంచే ఈ స్కూటర్ ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. దీని వల్ల దేశంలో ఉత్పత్తి పరిమాణం పెరుగడంతో ఖర్చులు నియంత్రణలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. యమహా వంటి గ్లోబల్ కంపెనీ పవర్ ట్రెయిన్, ఇంజనీరింగ్, బ్యాటరీ ఇంటిగ్రేషన్, టెస్టింగ్తో కూడిన భారతీయ ఎలక్ట్రిక్ వాహన స్టార్టప్‌ను విశ్వసించడం శుభపరిణామమని నిపుణులు చెబుతున్నారు. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల కోసం పెరుగుతున్న పరిశోధన, అభివృద్ధి, తయారీ సామర్థ్యాలకు నిదర్శనంగా ఈ భాగస్వామ్యంగా సాక్ష్యంగా నిలుస్తుందని నివేదికల్లో స్పష్టం చేస్తున్నారు. యమహా ఆర్‌వై 01 భారతదేశంలో ప్రారంభిస్తే టీవీఎస్ ఐక్యూబ్, ఏథర్ రిజ్టా, బజాజ్ చేతక్, హీరో విడీ వీ1 వంటి ఈవీ స్కూటర్లకు గట్టి పోటీనిస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# స్పోర్ట్స్

## ఆ ఇద్దరూ వైవిధ్యమైన సారథులు.. నా కెప్టెన్సీ మంత్ర ఇదే..!

.

భారత టెస్టు సారథిగా ఎంపికైన శుభ్‌మన్ గిల్ త్వరలోనే ఇంగ్లండ్ పరీక్షను ఎదుర్కోనున్నాడు. సీనియర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ లు వీడ్కోలు పలకిన వేళ .. సుదీర్ఘ ఫార్మాట్‌కు 37వ సారథిగా ఎంపికైన గిల్ తన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నాడు. రోహిత్, విరాట్ నాయకత్వంలో ఆడిన ఈ కుర్రాడు ఇప్పుడు కెప్టెన్‌గా టీమిండియాను గెలుపు శిఖరాల వైపు నడపనున్నాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ ను ప్లే ఆఫ్స్ చేర్చిన గిల్.. టెస్టు సారథ్యంపై తొలిసారి స్పందించాడు.తన అభిమాన క్రికెటర్లు అయిన రోహిత్, కోహ్లీలలోని కెప్టెన్సీ లక్షణాలను తాను పుణికి పుచ్చుకోవాలని భావిస్తున్నట్టు వెల్లడించాడీ యువ సారథి. 'రోహిత్, కోహ్లీ.. ఇద్దరి కెప్టెన్సీ విభిన్నంగా ఉంటుంది. అయితే.. వాళ్లిద్దరి లక్ష్యం ఒక్కటే జట్టును గెలిపించాలి. వీళ్లలో ఈ కామన్ పాయింట్ నాకు బాగా నచ్చేది. కెప్టెన్‌గా విజయం సాధించాలంటే ప్రత్యేకమైన స్టయిల్ ఉండాలి. విరాట్



విషయానికొస్తే.. మైదానంలో చాలా దూకుడుగా ఉంటాడు. జట్టును ముందుండి నడిపించాలని ఆరాటపడుతాడు.

హిట్‌మ్యాన్ కూడా దూకుడైన సారథే. కానీ, కోహ్లీలా భావోద్వేగాలను పైకి కనిపించనీయడు. ఫీల్డ్‌లో వ్యూహాలు పన్నడంలో దిట్ట అయిన రోహిత్ నుంచి టమిని ఒప్పుకోని కోహ్లీ నుంచి నేను చాలా విషయాలు నేర్చుకున్నా. వీళ్లిద్దరిలోని లక్షణాలు అలవర్చుకొని.. నాయకుడిగా నా ముద్ర వేయడంపై దృష్టి సారిస్తాను. చెప్పాలంటే నా కెప్టెన్సీ మంత్ర ఇదే' అని బీసీసీఐ షేర్ చేసిన వీడియోలో గిల్ వెల్లడించాడు.

**5 సెంచరీలు, 7 అర్ధ శతకాలు**

అంతేకాదు ఆటగాళ్లతో తరచూ సంభాషించడం.. వాళ్లతో అద్భుత ఫలితాలు సాధించడం వంటివి రోహిత్‌తో తనకు నచ్చుతాయని గిల్ చెప్పాడు. 'రోహిత్ చాలా ప్రశాంతంగా ఉంటాడు. ప్రతి ఆటగాడితో మాట్లాడుతూ.. వాళ్ల బాధ్యతలను గుర్తు చేస్తాడు. తాను వాళ్ల నుంచి ఏం కోరుకుంటున్నాడు అనేది స్పష్టంగా చెబుతాడు. సీనియర్లు రోహిత్, కోహ్లీతో పాటు అశ్విన్ కూడా మాకు స్ఫూర్తిదాయకమే.విదేశాల్లో ఎలా ఆడాలి? ప్రత్యర్థి ఎత్తులను ఎలా చిత్తు చేయాలి? అనే విషయాల్ని ఈ ముగ్గురు మాకు ఆచరించి చూపించారు. సో.. కెప్టెన్‌గా నేను వీళ్ల బాటలోనే పయనిస్తాను' అని గిల్ తెలిపాడు. ఇంగ్లండ్ పర్యటనతో పగ్గాలు చేపట్టనున్న గిల్.. ఇప్పటివరకూ 32 టెస్టు మ్యాచులు ఆడాడు. 5 సెంచరీలు, 7 అర్ధ శతకాలు కలిపి 1,893 రన్స్ సాధించాడు.

## సూపర్ కింగ్స్ ఆల్‌రౌండ్ షో.. గుజరాత్‌కు రెండో హార్ట్‌బ్రేక్..!

ఐపీఎల్ 18వ సీజన్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ గుజరాత్ టైటాన్స్ కు ఓటమి తప్పలేదు. టాపార్డర్‌నే నమ్ముకంటూ వరుస విజయాలు సాధిస్తూ ప్లే ఆఫ్స్ చేరిన ఆ జట్టు.. సొంత గడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. భారీ ఛేదనలో టాపార్డర్‌లోనే 3 వికెట్లు కోల్పోయిన గుజరాత్.. రవీంద్ర జడేజా (2-17), నూర్ అహ్మద్(3-21)ల స్పిన్‌కు విలవిలలాడింది. ఈ ఇద్దరూ తిప్పేయడంతో 83 పరుగుల తేడాతో సీఎస్కే జయకేతనం ఎగురవేసింది. ఈ ఎడిషన్‌కు విజయంతో వీడ్కోలు పలికింది. గత మ్యాచ్‌లో 200 ప్లస్ లక్ష్యాన్ని అందుకోలేక లక్నో చేతిలో చిత్తైన గిల్ బృందానికి తాజా పరాజయం శరాఘాతమే.ప్లే ఆఫ్స్ చేరుకోలేదనే బాధలో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు మురిసింది. లీగ్ దశ చివరి పోరులో గుజరాత్ టైటాన్స్‌ను వాళ్ల సొంత గడ్డపైనే ఓడించిన సీఎస్కే గెలుపు సంబురాలు చేసుకుంది. బ్యాటర్లు సమిష్టిగా



రాణించడంతో 330 రన్స్ కొట్టిన చెన్నై.. అనంతరం బౌలర్ల విజృంభణతో ఆతిథ్య జట్టును 147కే కట్టడి చేసింది. 83 పరుగుల భారీ విజయంతో టోర్నీకి వీడ్కోలు పలికింది ధోనీ సేన. మరోవైపు.. గత పోరు లక్నో చేతిలో కంగుతిన్న గిల్ బృందానికి.. ఈ ఓటమి రెండో హార్ట్‌బ్రేక్ కానుంది.వరుసగా రెండో మ్యాచ్‌లో 200 ప్లస్ ఛేదనకు సిద్ధమైన గుజరాత్ టైటాన్స్‌కు చెన్నై పేసర్లు భారీ షాక్ ఇచ్చారు. భీకర ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్(13)ను అన్షుల్ కంబోజ్ మూడో ఓవర్లోనే పెవిలియన్ చేరాడు. 24కే తొలి వికెట్ పడిన వేళ జోస్ బట్లర్(5), సాయి సుదర్శన్(41 నాటౌట్)తో కలిసి జట్టును ఆదుకుంటాడని అనుకుంటే.. అతడిని ఖలీల్ వెనక్కి పంపాడు. వరుసగా రెండు వికెట్ల షాక్ నుంచి తేరుకునేలోపే.. డేంజరస్ హిట్టర్ రూథర్‌ఫోర్డ్(0)ను అన్షుల్ డకౌట్ చేశాడు. అంతే.. గుజరాత్ 5వ ఓవర్ మూడో బంతికే మూడో కోల్పోయింది.తద్వారా ఈ సీజన్‌లో శుభ్‌మన్ గిల్ సేన తొలిసారి పవర్ ప్లేలో మూడు వికెట్లు కోల్పోయింది. కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ సాయి సుదర్శన్(41), షారుక్ ఖాన్(19)లు ఆదుకునే ప్రయత్నం చేశారు. శివం దూబే వేసిన 10వ ఓవర్లో సాయి వరుసగా రెండో ఫోర్లు కొట్టగా.. షారుక్ ఖాన్ స్ట్రెయిట్‌గా సిక్సర్ బాదగా స్కోర్ 80 దాటింది. 10 ఓవర్లకు ఓవర్లకు గుజరాత్ స్కోర్.. 85-3. దాంతో, అప్పటికీ ఆ జట్టుకు గెలుపుపై ఆశలు ఉన్నాయి.

## సన్‌రైజర్స్ సూపర్ విక్టరీ.. కేకేఆర్‌కు లాస్ట్ పంచ్



ఢిల్లీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత విజయం సాధించింది. చివరి మ్యాచ్‌లో విశ్వరూపం చూపించింది. ఏకంగా 110 పరుగుల తేడాతో గెలుపొందింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ విభాగాల్లో రాణించి కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది. ఈ రోజు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు ఈ సీజన్‌లో తమ చివరి మ్యాచ్ ఆడేశాయి (IPL 2025). ఇప్పటికే ఐపీఎల్ తాజా సీజన్ నుంచి ఈ రెండు జట్లు నిష్క్రమించాయి.టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. దీంతో కోల్‌కతా బౌలింగ్ మొదలుపెట్టింది. కోల్‌కతా బ్యాటర్లను ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ (32) బెంబేలెత్తించారు. అభిషేక్ అవుటైన తర్వాత వచ్చిన క్లాసెన్ మరింత విధ్వంసం సృష్టించాడు. ప్రతి ఓవర్లో ఫోర్‌లు, సిక్స్‌లు కొడుతూ అలరించాడు. బంతిని బౌండరీ అవతలకు పంపడమే లక్ష్యంగా ఆడాడు. 37 బంతుల్లోనే మెరుపు శతకం సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో ఇది మూడో వేగవంతమైన సెంచరీ. చివర్లో ఇషాన్ కిషన్ (29) కూడా చెలరేగాడు. దీంతో సన్‌రైజర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 278 పరుగులు చేసింది.279 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. సునీల్ నరైన్ (31) మాత్రమే టాపార్డర్ బ్యాటర్లలో చెప్పుకోదగ్గ స్కోరు సాధించాడు. చివర్లో మనీష్ పాండే (37), హర్షిత్ రాణా (34) విజయం అంతరాన్ని తగ్గించే ఇన్నింగ్స్‌లు ఆడగలిగారు. దీంతో కోల్‌కతా నైట్ రైడర్స్ 18.4 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌట్ అయింది. సన్‌రైజర్స్ బౌలర్లలో హర్ష్ దుబే, ఎషాన్ మలింగ మూడేసి వికెట్లు తీశారు. జయ్‌దేవ్ ఉనద్కత్ రెండు వికెట్లు తీశాడు.




# కార్తీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన 'సర్దార్ 2' టీమ్

తమిళ సినీ పరిశ్రమ నుంచి వచ్చి తెలుగులోనూ స్టార్‌డమ్ సంపాదించుకున్న నటుడు కార్తీ. 'యుగానికి ఒక్కడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కార్తీ, ఆ తర్వాత 'ఆవారా', 'నా పేరు శివ', 'ఖాకీ', 'ఖైదీ', 'పొన్నియన్ సెల్వన్' వంటి చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. అయితే కార్తీ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రాలలో సర్దార్ ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగులోనూ రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమాకు తాజాగా సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. నేడు కార్తీ పుట్టినరోజు కావడంతో తాజాగా ఆయనకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. కొత్త పోస్టర్‌ను పంచుకుంది టీమ్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టర్ వైరల్‌గా మారింది.'సర్దార్ 2' సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. పార్ట్ 1కు జీవీ ప్రకాష్ కుమార్ సంగీత దర్శకుడిగా పని చేయగా, సీక్వెల్‌కు యువన్ శంకర్ రాజాను తీసుకోవడం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. అంతేకాకుండా, ఈ సీక్వెల్‌లో స్టార్ హీరో విజయ్ సేతుపతి కీలక పాత్రలో నటించబోతున్నారు. 'సర్దార్ 2' చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

# ఫిల్మ్ బ్యాక్‌గ్రౌండ్ ఉంటే.. హారర్ సినిమా చేసేదాన్ని కాదు..

## –నెపోటిజంపై అదా శర్మ కామెంట్స్



బాలీవుడ్‌లో బంధుప్రీతి (నెపోటిజం)పై తరచుగా చర్చలు జరుగుతాయన్న విషయం తెలిసిందే. ఈ విషయంపై నటి అదా శర్మ తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను సినిమా కుటుంబం నుండి వచ్చి ఉంటే.. తనను హారర్ సినిమాతో పరిచయం చేసేవారు కాదని ఆమె పేర్కొన్నారు.అదా శర్మ తన కెరీర్‌ను 2008లో విడుదలైన హారర్ సినిమా '1920' తో ప్రారంభించారు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద విజయం సాధించినప్పటికీ, ఒక నటిగా మంచి గుర్తింపు లభించలేదు. దీనిపై అదా శర్మ మాట్లాడుతూ, "నేను సినిమా కుటుంబం నుండి వచ్చి ఉంటే, నన్ను పరిచయం చేయడానికి ఒక పర్ఫెక్ట్ రొమాంటిక్ సినిమా కోసం వేచి ఉండేవారు. నా కుటుంబం నన్ను హారర్ సినిమా చేయనిచ్చేది కాదు. ఎవరు తమ కెరీర్‌ను దెయ్యం పట్టినట్లు, నల్లటి పళ్లతో తెరపై కనిపిస్తూ ప్రారంభిస్తారు? ప్రముఖుల కుటుంబం నుండి వచ్చి ఉంటే, ఒక సాధారణ రొమాంటిక్ సినిమాతో నా కెరీర్ ప్రారంభమయ్యే అవకాశం ఉండేది. నేను '1920' తో ప్రారంభించాను, అందుకు నేను అదృష్టవంతురాలిని. నేను ఏదైనా కొత్తగా ప్రయత్నించినప్పుడల్లా ప్రేక్షకులు నన్ను అంగీకరించారు, బహుశా అందుకే సినీ నిర్మాతలు కూడా నన్ను విభిన్న పాత్రలలో నటించడానికి ధైర్యం చేస్తున్నారు" అని అన్నారు. అదా శర్మ 'కమాండో' ఫ్రాంచైజీలో యాక్షన్ పాత్రలతో ఆకట్టుకోవడమే కాకుండా, 'ది కేరళ స్టోరీ' చిత్రంలో కూడా నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ విషయంపై అదా శర్మ మాట్లాడుతూ, 'ది కేరళ స్టోరీ' చూసినప్పుడు, 'ఓహ్, ఆమె యాక్షన్ చేయగలదు, ఆమె ఎందుకు టెర్రరిస్ట్‌లను కొట్టడం లేదు?' అని ప్రజలు అనలేదు. 'సన్‌ఫ్లవర్ సీజన్ 2' లో బార్ డ్యాన్సర్ రోసీగా, 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' లో ఐపీఎస్ అధికారిగా కూడా ప్రజలు నన్ను మెచ్చుకున్నారు. నా కెరీర్ ఈ విధంగా విభిన్నంగా సాగినందుకు నేను చాలా అదృష్టవంతురాలిని" అని తెలిపారు. అదా శర్మ తన కెరీర్‌లో విభిన్నమైన, సవాలుతో కూడిన పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ప్రస్తుతం అదా శర్మ తన రాబోయే ప్రాజెక్ట్‌లో ఒక దేవత పాత్రలో కనిపించనున్నారు.



# ఆ క్షణంలో ఏదో సాధించాననే ఫీలింగ్


తాను నటించిన ఒక్క తెలుగు సినిమా కూడా విడుదల కాకముందే.. ఇక్కడి స్టార్ హీరోయిన్లకు ఏమాత్రం తగ్గని క్రేజ్‌ని సాధించారు మలయాళ భామ మాళవిక మోహనన్. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఈ మలయాళ మందారం ఇటీవల తన ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. ఈ సందర్భంలో ప్రభాస్ గురించి అభిమానులు అడగ్గా.. 'ప్రభాస్‌తో పరిచయం కాకముందు పలు ఇంటర్వ్యూల్లో ఆయన్ను చూశా. ఆ మాట్లాడే తీరు చూసి.. తాను అంతర్ముఖుడేమో, ఎవరితో ఎక్కువగా మాట్లాడడేమో అనుకున్నా.కానీ ఆయనతో కలిసి పనిచేయడం మొదలుపెట్టిన తర్వాత నా అభిప్రాయం తప్పని అర్థమైంది. నిజానికి ఆయనంత సరదాగా ఎవరూ ఉండరు. ఆయన ఉంటే సెట్ అంతా కోలాహలమే. డల్ మూమెంట్ అనేది ఆయన దరిదాపుల్లో ఉండదు.' అంటూ చెప్పుకొచ్చింది మాళవిక. 'నేను సాధించాను.. అని మీకు అనిపించిన క్షణమేది? అని ఓ అభిమాని అడగ్గా.. 'క్యూ లైన్లో వేచి ఉండకుండా డైరెక్ట్‌గా దేవాలయాల్లోకి అడుగుపెట్టిన క్షణంలో ఏదో సాధించాననే ఫీలింగ్.' అని సమాధానమిచ్చింది మాళవిక. 'ది రాజాసాబ్' తర్వాత మీరు చేయబోయే తెలుగు సినిమా ఏది? అనడగ్గా.. 'మీరే చెప్పండి?.. మీరు నన్ను ఏ హీరోకు జంటగా చూడాలనుకుంటున్నారు!? ' అంటూ ఎదురు ప్రశ్నించి అందంగా నవ్వేసింది మాళవిక మోహనన్.



# ధనుష్ 'కుబేర' టీజర్ విడుదల

టాలీవుడ్ క్లాసిక్ చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో మల్టీ లింగ్వెల్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ., అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 20, 2025న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి ట్రాన్స్ ఆఫ్ కుబేరా అంటూ టీజర్‌ను వదిలారు మేకర్స్. నాది నాది నాది అంటూ పాటతో సాగిన ఈ టీజర్ ఆసక్తికరంగా సాగింది.ఈ టీజర్ చూస్తుంటే.. ధనుష్ ఈ సినిమాలో ఇదివరకెన్నడూ చేయని సరికొత్త పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. నాగార్జున కూడా సాలిడ్ రోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో దేవిశ్రీ ప్రసాద్ ఇచ్చిన స్కోర్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.

# ధనుష్ 'కుబేర' టీజర్ విడుదల




టాలీవుడ్ క్లాసిక్ చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర (Kuberaa). తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో మల్టీ లింగ్వెల్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ LLP, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 20, 2025న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి ట్రాన్స్ ఆఫ్ కుబేరా అంటూ టీజర్‌ను వదిలారు మేకర్స్. నాది నాది నాది అంటూ పాటతో సాగిన ఈ టీజర్ ఆసక్తికరంగా సాగింది.ఈ టీజర్ చూస్తుంటే.. ధనుష్ ఈ సినిమాలో ఇదివరకెన్నడూ చేయని సరికొత్త పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. నాగార్జున కూడా సాలిడ్ రోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో దేవిశ్రీ ప్రసాద్ ఇచ్చిన స్కోర్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492